@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
మన వార్త
AP EDITION
విజయవాడ
ప్రతి అక్షరం... ప్రజల కోసం
బుధవారం 26 ఆగస్టు 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



# జూడాల సమ్మె విరమణ

- రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- జూడాల సమ్మెపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ
- సమ్మె విరమిస్తున్నట్లు హైకోర్టుకు నివేదించిన జూడాల సంఘం
- తమ డిమాండ్లు పరిష్కరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థన
- సమ్మె విరమిస్తున్నట్లు హైకోర్టుకు నివేదించిన జూడాల సంఘం

**అమరావతి**

జూనియర్ డాక్టర్ల సమ్మెపై దాఖలైన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సమ్మె విరమిస్తున్నట్లు ఏపీ జూడాల సంఘం ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టుకు నివేదించింది. ఈ సందర్భంగా తమ డిమాండ్లు పరిష్కరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని జూడాల సంఘం అభ్యర్థించింది. దీంతో రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో సమ్మె విరమిస్తున్నట్లు హైకోర్టుకు జూడాల సంఘం నివేదించింది. స్టయిపెండ్‌ను 30 శాతం పెంపు. ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయసును 65 ఏళ్లకు పెంచకూడదు. వైద్యశాఖలో - మిగతా3లో

## ‘అఖండ గోదావరి’ పేరుతో


# పుష్కరాలు



- నిర్వహణ ఏర్పాట్లపై సీఎం సమీక్ష
- గోదావరి పుష్కరాల నిర్వహణపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రూ.4,026 కోట్లతో 4,932 పనులు చేస్తున్నామన్న సీఎం
- 8 నుంచి 10 కోట్ల మంది భక్తులకు భారీ ఏర్పాట్లు.. ఏఐతో రద్దీ నియంత్రణ

**అమరావతి**

వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలను రాష్ట్ర చరిత్రలోనే అత్యంత వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మికత, సంస్కృతి, పర్యాటకాన్ని మేళవిస్తూ ప్రపంచస్థాయి ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. భక్తులకు పవిత్రత, పారిశుద్ధ్యం, భద్రత, సౌకర్యాల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు ‘అఖండ గోదావరి’ పేరుతో పుష్కరాల - మిగతా3లో



## ఆత్మనిర్భర్ భారత్‌కు మరింత ఊతం

- ‘దేశీయ సంస్థలకే డీఆర్‌డీఓ క్షిపణి టెక్నాలజీ’
- రాజ్‌నాథ్ సింగ్ కీలక నిర్ణయం
- డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన సంప్రదాయ క్షిపణి వ్యవస్థల టెక్నాలజీ బదిలీకి రక్షణ మంత్రి ఆమోదం
- దేశీయ తయారీ సామర్థ్యాలను మరింత పెంచడమే లక్ష్యం



## కులగణన ప్రశ్నలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి

- మోదీకి ఖర్గే, రాహుల్ లేఖ
- కులగణనపై ప్రధాని మోదీకి ఖర్గే, రాహుల్ సంయుక్త లేఖ
- కులగణనలో తెలంగాణ, బిహార్ పద్ధతిని పరిగణనలోకి తీసుకోవాలని సూచన
- రెండు రాష్ట్రాల్లో కులగణనలో అనుసరించిన విధానం స్పష్టంగా ఉందన్న ఖర్గే, రాహుల్



## డిజిటల్ పేమెంట్ జర్నీలో యూపీఐ టర్నింగ్ పాయింట్

- ప్రతి భారతీయుడు గర్వపడాలి: ప్రధాని మోదీ.. 2016లో ప్రారంభమైన యూపీఐకి పదేళ్లు
- 2025-26లో 24,162 కోట్లకు పైగా లావాదేవీలు
- 11 దేశాలకు విస్తరించిన భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ
- 2026 జులైలో రూ.29.87 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు

## గ్రేట్ గ్రీన్ వాల్‌లో

# తాటి వనాలు

- 55 లక్షల గింజలు నాటడమే లక్ష్యం
- గ్రేట్ గ్రీన్ వాల్ రెండో అంచెలో తుపాను గాలి నిరోధక వ్యవస్థగా తాటి చెట్లు
- 5,499 హెక్టార్లలో 55 లక్షల తాటి గింజలు నాటడం లక్ష్యమన్న డిప్యూటీ సీఎం పవన్
- ప్రకృతి విపత్తుల సమయంలో తాటి వనాలు తీర ప్రాంత గ్రామాలకు తీవ్ర గాలుల నుంచి రక్షణ కల్పిస్తాయి



**అమరావతి**

సుదీర్ఘ తీర ప్రాంతాలకు సహజ రక్షణ కవచం కోసం చేపట్టిన గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టులో భాగంగా తాటి వనాలు పెంచే ప్రక్రియ మొదలైందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా తీర ప్రాంతం వెంబడి 5,499 హెక్టార్ల పరిధిలో 55 లక్షల తాటి గింజలను నాటుతున్నట్లు చెప్పారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు, విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో లక్షా 65 వేల తాటి గింజలు నాటినట్లు తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో తాటి వనాలు తీర ప్రాంత గ్రామాలకు తీవ్ర గాలుల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. బలమైన సముద్ర గాలులకు సహజ నిరోధక వ్యవస్థగా తాటి చెట్లు పని చేస్తాయని అన్నారు. తాటి వేర్లు నేలను గట్టిగా పట్టి ఉంచడం వల్ల తీర ప్రాంతాల్లో కోత నిరోధక వ్యవస్థగా కూడా ఉంటుందని వివరించారు. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రణాళికల్లో మొదటి అంచె మడ - మిగతా3లో



## దేశంలో ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా ఉంది

- ఎస్ఐఆర్ నిర్వహించడానికి ధైర్యం, ఓటర్ల సహకారం అవసరం
- ఈసీఐ జ్ఞానేశ్ కుమార్
- ఎస్ఐఆర్‌పై కీలక వ్యాఖ్యలు చేసిన కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్
- ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించడానికి ఈసీకి ధైర్యం ఉండాలని వెల్లడి
- అందుకు ప్రజల నుంచి సహకారం కూడా అవసరమని అభిప్రాయం
- ఈసీకి ఓటర్ల నుంచి పూర్తి సహకారం లభించింది

## క్లీన్ ఎనర్జీలో సౌదీ అరేబియాలా ఏపీ

- ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుంది: నారా లోకేశ్
- సుజ్లాన్ విండ్ పవర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన లోకేశ్
- పెట్టుబడులతో ఏపీకి వచ్చే వారికి సింగిల్ విండోలో అనుమతులు ఇస్తామని భరోసా
- 1,325 మెగావాట్ల సుజ్లాన్ విండ్ పవర్ ప్రాజెక్టుకు లోకేశ్ శంకుస్థాపన




**అమరావతి**

క్లీన్ ఎనర్జీలో సౌదీ అరేబియాలా ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెరలో 1,325 మెగావాట్ల సుజ్లాన్ విండ్ పవర్ ప్రాజెక్టుకు లోకేశ్ శంకుస్థాపన చేశారు. అనంతరం సుజ్లాన్ ఎస్?-144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్?ను ప్రారంభించారు. రూ. 10వేల కోట్ల పెట్టుబడితో సుజ్లాన్ సంస్థ ఏర్పాటు చేయనున్న పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. క్లీన్ ఎనర్జీలో 2019 - 24 మధ్యలో కేవలం 6 మెగావాట్ల సామర్థ్యమే అదనంగా ఏర్పాటు చేస్తే చంద్రబాబు నాయకత్వంలో తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ఏడాదిలోనే 4.2 గిగావాట్ల - మిగతా3లో

# డిజిటల్ పేమెంట్ జర్నీలో యూపీఐ టర్నింగ్ పాయింట్

దశాబ్దం క్రితం ప్రారంభమైన యూపీఐ దేశ డిజిటల్ చెల్లింపుల ప్రయాణంలో ఓ చారిత్రక మైలురాయని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. 2016 ఆగస్టు 25న ప్రారంభమైన యూపీఐ నేడు దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు, ఆర్థిక సమ్మిళిత సాధనకు వెన్నెముకగా నిలిచిందని మోదీ వెల్లడించారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా విస్తృతి, ప్రజల్లోకి చేరిన తీరు ప్రతి భారతీయుడు గర్వపడే అంశమని పేర్కొన్నారు. పదేళ్ల క్రితం యూపీఐ ప్రారంభం కావడం దేశ డిజిటల్ చెల్లింపుల ప్రయాణంలో కీలక మలుపుగా నిలిచిందని 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టులో తెలిపారు. యూపీఐని ఉపయోగించడం ద్వారా తమకు ఎదురైన అనుభవాలను పంచుకోవాలని, ఇది తమ రోజువారీ జీవితాలను ఎలా మార్చిందో వివరించాలని ప్రజలను ప్రధాని కోరారు.



### పదేళ్లలో భారీ వృద్ధి

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అభివృద్ధి చేసిన యూపీఐ ప్రస్తుతం దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలక భాగంగా మారింది. ప్రారంభమైన సమయంలో పరిమిత స్థాయిలో ఉన్న ఈ సేవ, ఇప్పుడు దేశంలోని కోట్లాది మంది రోజువారీ లావాదేవీలకు ప్రధాన సాధనంగా మారింది. గత పదేళ్లలో యూపీఐ లావాదేవీల సంఖ్య, వాటి విలువ రెండింటిలోనూ భారీగా వృద్ధి నమోదైంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, 2016-17 ఆర్థిక సంవత్సరంలో యూపీఐ ద్వారా 1.78 కోట్ల లావాదేవీలు మాత్రమే జరిగాయి. 2025-26 నాటికి ఆ సంఖ్య 24,162 కోట్లకు పైగా పెరిగింది. అంటే కేవలం పదేళ్లలో లావాదేవీల సంఖ్య దాదాపు 13 వేల రెట్లు పెరిగింది. అదే సమయంలో లావాదేవీల మొత్తం విలువ కూడా అనూహ్యంగా పెరిగింది. 2016-17లో రూ.0.07 లక్షల కోట్లుగా ఉన్న లావాదేవీల విలువ, 2025-26 నాటికి సుమారు రూ.314 లక్షల కోట్లకు చేరుకుంది. ఇది 4 వేల రెట్లకు పైగా పెరుగుదల అని చెప్పింది.

### 11 దేశాల్లో సేవలు

భారత్‌లో విజయవంతమైన యూపీఐ ఇప్పుడు అంతర్జాతీయంగానూ విస్తరిస్తోంది. ప్రస్తుతం 11 దేశాల్లో ఈ చెల్లింపు వ్యవస్థ అందుబాటులో ఉంది. గ్రీస్, మాల్దీవులు తాజాగా యూపీఐ సేవలను స్వీకరించిన దేశాలుగా నిలిచాయి. భూటాన్, నేపాల్, సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్, ఖతార్ వంటి దేశాల్లోనూ యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతో విదేశాల్లో ఉన్న భారతీయులు, ఆయా దేశాల్లోని వినియోగదారులు సరిహద్దులు దాటి డిజిటల్ చెల్లింపులు చేసే అవకాశం ఏర్పడింది.

### జులైలోనే రూ.29.87 లక్షల కోట్ల లావాదేవీలు


యూపీఐ వినియోగం ఎంత భారీ స్థాయికి చేరిందో తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2026 జులై నాటికి యూపీఐ నెట్‌వర్క్‌లో 741 క్రియాశీల బ్యాంకులు ఉన్నాయి. ఆ ఒక్క నెలలోనే 2365.8 కోట్ల లావాదేవీలు ప్రాసెస్ అయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.29.87 లక్షల కోట్లుగా నమోదైంది. చిన్న మొత్తాల నుంచి భారీ చెల్లింపుల వరకు వివిధ అవసరాలకు యూపీఐని ప్రజలు ఉపయోగిస్తున్నారు. ప్రపంచవ్యాప్త రియల్‌టైమ్ చెల్లింపుల్లోనూ యూపీఐ తన ప్రత్యేకతను చాటుకుంది. 2024లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన రియల్‌టైమ్ చెల్లింపు లావాదేవీల్లో యూపీఐ వాటా దాదాపు 49 శాతంగా ఉంది. రిటైల్ డిజిటల్ చెల్లింపుల వృద్ధిపై అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) విడుదల చేసిన నివేదికలోనూ భారత్ సాధించిన పురోగతిని ప్రముఖంగా ప్రస్తావించింది.

### కొత్త ఫీచర్లతో మరింత సులభంగా

వినియోగదారులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు యూపీఐలో కొత్త ఫీచర్లను కూడా ప్రవేశపెడుతున్నారు. 2025లో ఆన్-డివైస్ అథెంటికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా స్మార్ట్‌ఫోన్‌లోని వేలిముద్ర లేదా ఫేస్ అన్‌లాక్ వంటి సదుపాయాలను ఉపయోగించి యూపీఐ చెల్లింపులను ఆమోదించవచ్చు. అదే విధంగా ఆధార్ ఆధారిత ఫేస్ అథెంటికేషన్ ద్వారా యూపీఐ పిన్ ఏర్పాటు ప్రక్రియను మరింత సులభతరం చేశారు. ముఖ్యంగా తొలిసారి యూపీఐని ఉపయోగించే వారు, సీనియర్ సిటిజన్లు, కార్డులు సులభంగా అందుబాటులో లేని వారికి ఈ సదుపాయం ఉపయోగపడనుంది.

# ఆత్మనిర్భర్ భారత్‌కు మరింత ఊతం

రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) అభివృద్ధి చేసిన అన్ని సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతికతను భారతీయ పరిశ్రమలకు బదిలీ చేసేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు. దేశీయ సంస్థలు ఈ సాంకేతికతలను ఉపయోగించి భారత్‌లోనే క్షిపణులను తయారు చేసుకునేందుకు మార్గం సుగమమైంది. రక్షణ మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం, డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన సంప్రదాయ క్షిపణి వ్యవస్థల టెక్నాలజీని అర్హత కలిగిన భారతీయ సంస్థలకు బదిలీ చేయనున్నారు. ఇందుకోసం అవసరమైన అర్హతలు, ధ్రువీకరణలు, నియంత్రణ సంస్థల నిబంధనలను కంపెనీలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం ద్వారా డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన క్షిపణి సాంకేతికతలు కేవలం ప్రభుత్వ రంగ సంస్థలకే పరిమితం కాకుండా, అర్హత ఉన్న దేశీయ పరిశ్రమలు కూడా వాటిని ఉత్పత్తిలోకి తీసుకురావడానికి అవకాశం లభిస్తుంది.



### ఆత్మనిర్భర్ భారత్‌కు మరింత ఊతం

రక్షణ తయారీలో దేశీయ సామర్థ్యాలను పెంచడం, విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో డీఆర్‌డీఓ టెక్నాలజీని భారతీయ పరిశ్రమలకు బదిలీ చేయడం కీలక అడుగుగా రక్షణ మంత్రిత్వ శాఖ అభివర్ణించింది. దేశ రక్షణ అవసరాలను దేశీయంగా తీర్చుకోవడంతో పాటు, భారతీయ సంస్థలకు అత్యాధుని రక్షణ సాంకేతికతలపై పనిచేసే అవకాశం కల్పించడం ద్వారా రక్షణ తయారీ రంగం మరింత విస్తరించనుంది. దీర్ఘకాలంలో దేశీయ రక్షణ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

### హైపర్‌సోనిక్ ఆయుధాలపైనా దృష్టి

ఇప్పటికే భారత్ స్వదేశీ హైపర్‌సోనిక్ ఆయుధాల అభివృద్ధిలో ముందడుగు వేస్తోంది. హైపర్‌సోనిక్ గ్లైడ్, క్రూయిజ్ క్షిపణి సాంకేతికతలపై డీఆర్?డీఓ పరిశోధనలు కొనసాగిస్తోంది. అత్యంత వేగంతో ప్రయాణించే ఈ తరహా ఆయుధ వ్యవస్థలు భవిష్యత్తు రక్షణ అవసరాల్లో కీలకంగా మారనున్నాయి. ఇలాంటి అధునాతన సాంకేతికతలపై దేశీయంగా పరిశోధన, అభివృద్ధి సామర్థ్యాలను పెంచుకోవడం ద్వారా రక్షణ రంగంలో భారత్ వ్యూహాత్మకంగా మరింత బలోపేతం కావాలని కేంద్రం భావిస్తోంది. ఈ నేపథ్యంలో సంప్రదాయ క్షిపణి వ్యవస్థల టెక్నాలజీని దేశీయ పరిశ్రమలకు బదిలీ చేయాలని నిర్ణయించింది. రక్షణ రంగంలో పరిశోధన, అభివృద్ధి నుంచి భారీ స్థాయి ఉత్పత్తి వరకు దేశీయ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచే ప్రయత్నాల్లో ఇది మరో ముందడుగుగా నిలవనుంది.

### 12 ఏళ్లలో నాలుగు రెట్లు పెరిగిన రక్షణ ఉత్పత్తి

ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా దేశ రక్షణ తయారీ సామర్థ్యాన్ని ప్రస్తావించారు. గత 12 ఏళ్లలో దేశ రక్షణ ఉత్పత్తి నాలుగు రెట్లు పెరిగిందని పేర్కొన్నారు. దేశీయ రక్షణ పరిశ్రమ విస్తరిస్తోందని, తయారీ సామర్థ్యాలను మరింత పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రక్షణ మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, రక్షణ ఉత్పత్తి విలువ 2024-25 ఆర్థిక సంవత్సరంలో 15.6 శాతం పెరిగింది. 2020-21లో రూ.84,643 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తి విలువ 2024-25 నాటికి గణనీయంగా పెరిగింది. 2013-14తో పోలిస్తే స్వదేశీ రక్షణ ఉత్పత్తి దాదాపు నాలుగు రెట్లు పెరిగినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

### రికార్డు స్థాయిలో ఎగుమతులు

భారత్ రక్షణ ఉత్పత్తుల ఎగుమతుల్లోనూ కొత్త రికార్డులు నమోదు చేస్తోంది. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో భారత్? రక్షణ ఎగుమతులు రికార్డు స్థాయిలో రూ.38.424 కోట్లకు చేరాయి. ప్రస్తుతం 80కు పైగా దేశాలకు భారత్? రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. 2029 నాటికి రక్షణ ఎగుమతులను రూ.50 వేల కోట్లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్య సాధనలో దేశీయ పరిశ్రమల పాత్ర కీలకం కానుంది. ఇక భారత రక్షణ పారిశ్రామిక వ్యవస్థలో ప్రైవేటు రంగం కూడా కీలక భాగస్వామిగా మారుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ మొత్తం రక్షణ ఉత్పత్తిలో ప్రైవేటు రంగం వాటా సుమారు 24 శాతంగా ఉంది. రక్షణ ప్రభుత్వం రంగం సంస్థలు, ఇతర ప్రభుత్వ రంగం సంస్థలు కలిపి దాదాపు 76 శాతం ఉత్పత్తిని అందించాయి.

# కులగణన ప్రశ్నలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి

దేశంలో చేపడుతున్న కులగణన విధానంపై కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని మరోసారి ప్రశ్నించారు. కులగణన కోసం ప్రస్తుతం రూపొందించిన ప్రశ్నావళిని పూర్తిగా రద్దు చేసి, రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న విధానాన్ని తాము అంగీకరించడం లేదని స్పష్టం చేశారు. కులగణనలో ఓపెన్ ఎండెడ్ ప్రశ్నల విధానం తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు.



### ప్రధానికి మూడోసారి లేఖ

కులగణన అంశంపై ఖర్గే, రాహుల్ గాంధీ ఆగస్టు 20న హిందీలో ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఈ లేఖ వివరాలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మీడియాకు వెల్లడించారు. ఈ అంశంపై కాంగ్రెస్ నాయకత్వం ప్రధానమంత్రికి లేఖ రాయడం ఇది మూడోసారి అని తెలిపారు. అయితే ఇప్పటివరకు ప్రధాని నుంచి ఎలాంటి సమాధానం రాలేదని చెప్పారు. ప్రస్తుత కులగణన ప్రక్రియలో తీసుకుంటున్న చర్యలు కేవలం 'వైట్‌వాష్' మాత్రమేనని జైరాం రమేశ్ విమర్శించారు. కులాల వాస్తవ సంఖ్య, సామాజిక-ఆర్థిక పరిస్థితిని కచ్చితంగా అంచనా వేయాలంటే సరైన విధానంలో కులాల వివరాలను నమోదు చేయాల్సిన అవసరం ఉందని ఖర్గే, రాహుల్ తమ లేఖలో పేర్కొన్నారు.

### 'ఓపెన్ ఎండెడ్' ప్రశ్నతో సమస్యలు

ప్రస్తుతం కుల వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఓపెన్ ఎండెడ్ ప్రశ్నావళి విధానాన్ని ఎంచుకుందని కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అంటే వ్యక్తి తన కులం పేరును ఏ విధంగా చెబితే అదే పేరును నమోదు చేస్తారని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఒకే కులానికి వేర్వేరు పేర్లు, ఉపకులాల పేర్లు, భాషాపరమైన భేదాలతో కూడిన పేర్లు ఉన్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకే కులానికి చెందిన వ్యక్తులు వేర్వేరు పేర్లతో నమోదు అయితే, ఒక కులం అనేక వేర్వేరు కులాలుగా విడిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కులగణనలో వేలాది, లక్షలాది వేర్వేరు కులపేర్లు నమోదయ్యే ప్రమాదం ఉందని, అలా జరిగితే సేకరించిన డేటా ఉపయోగకరంగా ఉండదని పేర్కొన్నారు.

### ఓబీసీ జనాభాపై ప్రభావం

కులాల జనాభా కచ్చితంగా నమోదు కాకపోతే ఆయా వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితిపై చేసే అంచనాలు కూడా తప్పుగా మారతాయని కాంగ్రెస్ నేతలు అన్నారు. ముఖ్యంగా వెనుకబడిన తరగతులు, అత్యంత వెనుకబడిన వర్గాలు, ఇతర అణగారిన సముదాయాలకు దీనివల్ల నష్టం కలగవచ్చని తెలిపారు. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయ విధానాలకు సంబంధించిన నిర్ణయాలపై కూడా దీని ప్రభావం పడుతుందని ఖర్గే, రాహుల్ అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా ప్రస్తుత ప్రశ్నావళి విధానంలో దేశంలోని ఓబీసీల వాస్తవ జనాభా ఎంత అనేది స్పష్టంగా తేలే అవకాశం లేదని వారు పేర్కొన్నారు. కులగణనలో బ్యాక్‌వర్డ్ క్లాస్ అనే పదమే చేర్చలేదని వారు లేఖలో ప్రస్తావించారు.

ఈ సమస్యకు సులభమైన పరిష్కారం ఇప్పటికే ఉందని ఖర్గే, రాహుల్ సూచించారు. కులాల పేర్లతో ముందుగానే డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించి, అందులో నుంచి సంబంధిత కులాన్ని ఎంపిక చేసే విధానాన్ని తీసుకురావాలని కోరారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వివరాలను నమోదు చేసే సమయంలో ఇదే తరహా విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు సంబంధించిన ప్రభుత్వ జాబితాలు, ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వంటి ఇప్పటికే అందుబాటులో ఉన్న జాబితాల ఆధారంగా కులాల జాబితాను రూపొందించవచ్చని సూచించారు. తెలంగాణ, బిహార్‌లో నిర్వహించిన కుల సర్వేల విధానాన్ని కేంద్రం పరిశీలించాలని ఖర్గే, రాహుల్ కోరారు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ కులాల జాబితాను ఉపయోగించి వివరాలు సేకరించిన విషయాన్ని వారు ప్రస్తావించారు. తమ లేఖకు తెలంగాణ కుల సర్వే-2024, బిహార్ కుల సర్వే-2022లో ఉపయోగించిన కులాల జాబితాల ప్రతులను కూడా జత చేసినట్లు తెలిపారు.

## దేశంలో ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా ఉంది

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియను నిర్వహించడానికి ఎన్నికల సంఘానికి ధైర్యం, ఓటర్ల నుంచి బలమైన సహకారం రెండూ అవసరమని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఈ సహకారం వల్లే కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఇతర దేశాల నుంచి గుర్తింపు పొందగలిగిందని పేర్కొన్నారు. ఎస్‌ఐఆర్‌కు ఓటర్ల నుంచి సహకారం పుష్కలంగా లభించిందన్నారు. లఖ్‌నవూలో ఎన్నికల సంఘం నిర్వహించిన 'ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్, ECINET' జరిగిన రెండో ప్రాంతీయ సదస్సులో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "ఎస్‌ఐఆర్ నిర్వహణకు ఎన్నికల సంఘానికి ధైర్యం మాత్రమే కాదు. ఓటర్ల సహకారం కూడా అవసరం. ఎస్‌ఐఆర్ నిర్వహణకు ఈసీకి ఓటర్ల నుంచి ఆ సహకారం పుష్కలంగా లభించింది. అందుకే ప్రస్తుతం ఇతర దేశాలు భారత ఎన్నికల సంఘం వైపు చూస్తున్నాయి. ఈసీఐ నుంచి ఎంతో నేర్చుకుంటున్నాయి, ప్రశంసిస్తున్నాయి. అలాగే తమ దేశాల్లో కూడా ఇలాంటి ఎన్నికల విధానాలను అమలు చేయాలని భావిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియలపై అవగాహనను పెంపొందించడానికి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ చాలా అవసరం." భారతదేశంలో ఎన్నికలు రాజ్యాంగం, చట్టం, కేంద్ర ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన సూచనల ప్రకారం జరుగుతాయని జ్ఞానేశ్ కుమార్ వివరించారు. అలాగే అన్ని దశల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధుల పర్యవేక్షణలో పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. దేశ ఎన్నికల విధానం, ప్రజాస్వామ్య విలువలు, ఓటర్ల నమోదు, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు, అలాగే భారత ఎన్నికల సంఘం పాత్ర, పనితీరు గురించి విద్యార్థులు, యువ ఓటర్లకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని జ్ఞానేశ్ కుమార్ నొక్కి చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో యువ ఓటర్ల నమ్మకం, అవగాహనతో కూడిన భాగస్వామ్యం ప్రజాస్వామ్య భవిష్యత్తుకు ఒక పెట్టుబడి అని జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పారదర్శకతతో కూడుకున్నదని తెలిపారు. లఖ్‌నవూ, ఉత్తర్‌ప్రదేశ్ ఓటర్లు చాలా చైతన్యవంతులని కొనియాడారు. అలాగే లఖ్‌నవూ నగరంతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. ఉన్నత విద్య కోసం ఐఐటీకి వెళ్లే ముందు తాను లఖ్‌నవూలోనే చదువుకున్నానని స్పష్టం చేశారు. చాలా కాలం తర్వాత ఉత్తర్‌ప్రదేశ్ ఓటర్లకు ఒక సందేశాన్ని అందించడానికి తాను లఖ్‌నవూకి తిరిగి వచ్చానని చెప్పారు.

### ఈవీఎం గురించి ఏమన్నారంటే?

ఈవీఎంలపై వచ్చిన ఆరోపణలపైనా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్పందించారు. ఈవీఎంలను ప్రభుత్వ రంగ సంస్థలే తయారు చేస్తాయని చెప్పారు. వాటికి ఇంటర్నెట్, బ్లూటూత్, వైఫై కనెక్టివిటీ లాంటి సదుపాయాలు ఏవీ ఉండవని వెల్లడించారు. దేశంలో సుమారుగా 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘంతో కోటి 80 లక్షల మంది పనిచేస్తున్నారని వివరించారు. ప్రస్తుత సోషల్ మీడియా కాలంలో విద్యార్థులు ఏదైనా సమాచారాన్ని నమ్మే ముందు లేదా ఇతరులతో దాన్ని పంచుకునే ముందు కచ్చితంగా దాని మూలాలను, ప్రామాణికతను సరిచూసుకోవాలని కోరారు. "దేశంలో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న ఓటర్ల కోసం ఎన్నికలు నిర్వహించడం ఒక భారీ టాస్క్‌లా ఉంటుంది. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగాలు రేయింబవళ్లు శ్రమిస్తారు. యువత ఈ ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలి. 18 ఏళ్లు నిండిన విద్యార్థులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి. ఎన్నికల సంఘం తన డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఓటర్ల నమోదు కోసం వీలు కల్పిస్తోంది. యువత ఓటర్లుగా మారడమే కాకుండా, తమ కుటుంబ సభ్యులను, స్నేహితులను కూడా ఎన్నికల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుకు యువత అత్యంత కీలకమైన చోదక శక్తి. యువత అవగాహనతో ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటే, ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుంది" అని జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు.

## భారత్‌లో పెరుగుతున్న శ్వాసకోశ వ్యాధులు

**98% కేసులకు హెచ్1ఎన్1 వైరస్ రకమే కారణం: ఐసీఎంఆర్**



భారతదేశంలో ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న శ్వాసకోశ వ్యాధులకు హెచ్1ఎన్1 వైరస్ రకమే ప్రధాన కారణమని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ బాల్? మంగళవారం వెల్లడించారు. తాము పరీక్షించిన ఇన్‌ఫ్లూయెంజా-ఏ కేసుల్లో దాదాపు 98 శాతం ఈ వైరస్ రకానికే చెందినవని ఆయన తెలిపారు. వైరస్‌ల వ్యాప్తిని ఎప్పటికప్పుడు కనిపెట్టేందుకు, భారతదేశం ఒక బహుళ అంచెల, రియల్ టైమ్ వ్యాధి నిఘా నెట్?వర్క్?ను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. ఈ నిఘా వ్యవస్థ రాష్ట్ర స్థాయి డేటాను 'సమీకృత ఆరోగ్య సమాచార వేదిక' (ఐహెచ్‌ఐపీ), 'జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం(ఎన్‌సీడీసీ)తో అనుసంధనం చేస్తుందని తెలిపారు. దీనితోపాటు ఐసీఎంఆర్? నేరుగా ఆసుపత్రుల నుంచి సేకరించిన శాంపిల్స్ ద్వారా హెచ్1ఎన్1 వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు పెరుగుదలను తక్షణమే గుర్తించి, నివారణ చర్యలు తీసుకుంటుందని అన్నారు.

"దేశంలో ఏ వైరస్ ఎలా వ్యాప్తి చెందుతుందో మనకు ఎలా తెలుస్తుంది? కొవిడ్ తర్వాత, భారతదేశంలో ఏ సమయంలో ఏం జరుగుతుందో రియల్? టైమ్?లో గుర్తించే సామర్థ్యాన్ని మనం పెంచుకున్నాం. మేము బహుళ స్థాయిల్లో నిఘా పెడతాం. మొదట ఐహెచ్?ఐపీ, ఎన్?సీడీసీ నిఘా ద్వారా అన్ని రాష్ట్రాల నుంచి ఇన్ఫెక్షన్ల సమాచారం వస్తుంది. దాన్ని మేము తీసుకుంటాం. వారి ల్యాబ్?ల నుంచి వచ్చిన నివేదికలు కూడా మాకు అందుతాయి. ఇవి కాకుండా, ఈ హెచ్?1ఎన్?1 వైరస్? లాంటి ప్రత్రి సింద్రోమ్?లను కనిపెట్టడం కోసం, మేము దేశమంతటా 73 ల్యాబ్?లు/ ఆసుపత్రుల ద్వారా ఐసీఎంఆర్? సెంటినెల్? నిఘాను ఏర్పాటు చేశాం. ఇది ఎన్?సీడీసీ కంటే పై స్థాయిలో జరుగుతుంది" అని భారత వైద్య పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్? రాజీవ్ బాల్? తెలిపారు.

### విపరీతంగా పెరుగుతున్న కేసులు

ఇతర శ్వాసకోశ వైరస్?లతో పోలిస్తే హెచ్1ఎన్1 ఇన్ఫెక్షన్లు దేశవ్యాప్తంగా విపరీతంగా పెరుగుతున్నాయని రాజీవ్ బాల్ తెలిపారు. అదే సమయంలో కొవిడ్-19 కేసులు స్థిరంగా తగ్గుముఖం పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. "ప్రస్తుతం శ్వాసకోశ నిఘా ప్రకారం, హెచ్1ఎన్1 (ఇన్‌ఫ్లూయెంజా-ఏ) ఎక్కువగా వ్యాప్తిలో ఉంది. మనుషులకు ఇన్‌ఫ్లూయెంజా-ఏ, ఇన్‌ఫ్లూయెంజా- బి అనే రెండు రకాలు వస్తాయి. ఇన్‌ఫ్లూయెంజా-ఏలో మేము ఎక్కువగా చూస్తున్నది హెచ్?1ఎన్?1 వైరస్?. ఇది సుమారు 97-98 శాతంగా ఉంది. కాగా హెచ్?3ఎన్?2 రకం వైరస్ కేవలం 2 నుంచి 3 శాతం మాత్రమే ఉంది. దీనితోపాటు విక్టోరియా లీనియేజ్?కి చెందిన ఇన్?ఫ్లూయెంజా-బి కూడా వ్యాప్తిలో ఉంది. ఇందులో రెండు రకాలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఒక్కటి మాత్రమే వ్యాప్తిలో ఉంది. అది కూడా అంత ఎక్కువగా లేదు. హెచ్1ఎన్1 మాత్రమే ప్రధానంగా ఎక్కువగా వ్యాప్తిస్తోంది. మూడోది సార్స్-కోవ్-2 (కొవిడ్-19) కేసులు అంతకు ముందు కొద్దిగా ఎక్కువగా ఉన్నప్పటికీ, ఇప్పుడు అవి తగ్గుముఖం పడుతున్నాయి" అని భారత వైద్య పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ రాజీవ్ బాల్ చెప్పారు.

### ఈ వైరస్ లక్షణాలు ఇవే!

అయితే హెచ్1ఎన్1తో కూడిన ఈ సీజనల్ ఇన్?ఫ్లూయెంజా సాధారణంగా దానింతట అదే తగ్గిపోతుందని ఐసీఎంఆర్ ప్రకటించింది. జ్వరం, దగ్గు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు దీని సాధారణ లక్షణాలు అని పేర్కొంది. సరైన వైద్యం, రక్షణ, విశ్రాంతి ఉంటే చాలా వరకు ఈ వ్యాధి నుంచి కోలుకోవచ్చని స్పష్టం చేసింది. కాగా, దేశ రాజధాని దిల్లీలో స్వైన్‌ఫ్లూ కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ సంఖ్య 2,300 దాటింది. ఈ ఏడాది దిల్లీలో ఇప్పటివరకు దాదాపు మూడు వేల ఇన్‌ఫ్లుయెంజా కేసులు నమోదయ్యాయని.. వాటిలో 2,308 హెచ్1ఎన్1 కేసులు ఉన్నాయని దిల్లీ వైద్యశాఖ మంత్రి పంకజ్ కుమార్ సింగ్ వెల్లడించారు. అయితే ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని ఆయన పేర్కొన్నారు.

# ‘అఖండ గోదావరి’ పేరుతో పుష్కరాలు

-మొదటిపేజీ తరువాయి

నిర్వహణపై కూడా పరిశీలన చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. రోజుకు దాదాపు కోటి మంది పుణ్యస్నానాలు చేసే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ఉన్న ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త ఘాట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 440 ఘాట్లు భారీ పనుల ముమ్మరం: పుష్కరాల కోసం మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే రూ.899 కోట్లను విడుదల చేసినట్లు అధికారులు సీఎంకు వివరించారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, పోలవరం జిల్లాల్లో రోడ్లు, ఘాట్లు, తాగునీటి వసతులు, విద్యుత్, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను ఆధునీకరించడంతో పాటు 181 కొత్త ఘాట్లను నిర్మించి మొత్తం 440 ఘాట్లు సిద్ధం చేస్తున్నారు. పట్టణాభివృద్ధి, ఆర్అండ్‌బీ, జల వనరులు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నట్లు చెప్పారు. అదనపు నిధుల సమీకరణతో పాటు కేంద్ర సాయం పొందేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.



ఏఐతో భద్రత – డ్రోన్ల పర్యవేక్షణ: ఈసారి పుష్కరాల్లో సాంకేతికతకు పెద్దపీట వేయనున్నారు. రద్దీ నియంత్రణ కోసం ఏఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సీసీటీవీ ఎంట్రీ–ఎగ్జిట్ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూ ఆర్ ఆధారిత వాహన గుర్తింపు వ్యవస్థలను వినియోగించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా ప్రత్యేక కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

**పుణ్యక్షేత్రాలకు టూరిజం సర్క్యూట్:**

గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ దేవాలయాలను కలుపుతూ ప్రత్యేక టెంపుల్ టూరిజం సర్క్యూట్ రూపొందించనున్నారు. పిఠాపురం శక్తిపీఠం, నాలుగు పంచారామ క్షేత్రాలు, అన్నవరం, ద్వారకా తిరుమల, వాడపల్లి, అంతర్వేది వంటి పుణ్యక్షేత్రాలను ఒకే పర్యాటక మార్గంలో అనుసంధానించాలని సీఎం ఆదేశించారు. భక్తులకు ఆధ్యాత్మిక ప్రదేశాలతో పాటు పర్యాటక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పించేందుకు హోమ్‌స్టేలను ప్రోత్సహించాలని, కొత్త హోటళ్లకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని చెప్పారు.

రాజమహేంద్రవరంలో భారీ కార్యక్రమాల నిర్వహణకు కన్వేషన్ సెంటర్ నిర్మించాలని సీఎం సూచించారు. దేశ, విదేశాల్లోని ప్రముఖులను పుష్కరాలకు ఆహ్వానించి రాష్ట్ర ప్రత్యేకత, ప్రతిష్టను ప్రపంచానికి చాటాలని చెప్పారు. పుష్కర ఘాట్లను కలిపే రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు పుష్కరాలు జరిగే ఆరు జిల్లాల్లో రోడ్లపై ఒక్క గుంత కూడా కనిపించకూడదని సీఎం స్పష్టం చేశారు.

**పవిత్రత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి:**

గోదావరిలో ఒక్క చుక్క మురుగునీరు కూడా కలవకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పుష్కరాల పవిత్రత, పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులకు రవాణా, వసతి, తాగునీరు, వైద్యం, భద్రత వంటి అన్ని సౌకర్యాలు సమగ్రంగా అందేలా ప్రణాళిక చేయాలని సూచించారు.

**వైద్యం, రవాణాకు సమగ్ర ప్రణాళిక:**

భక్తుల కోసం 30 తాత్కాలిక ఫీల్డ్ ఆస్పత్రులు, మెడికల్ క్యాంపులు, అంబులెన్సులు, ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. నదిలో భద్రత కోసం 2,697 రెస్క్యూ బోట్లు, 8,955 మంది శిక్షణ పొందిన ఈతగాళ్లు అందుబాటులో ఉంటారు. పుష్కరాలను గ్రీన్ అండ్ క్లీన్ ఈవెంట్?గా నిర్వహించేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులు నడపడంతో పాటు 11 బస్‌స్టేషన్లను ఆధునీకరించనున్నారు.

గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు అనేక ఉపనదులు, వాగులు, ఏరులు కలుస్తున్న నేపథ్యంలో ‘అఖండ గోదావరి’ పేరుతో పుష్కరాలను నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మికత, పర్యాటకం, సంస్కృతి అన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంగా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలను పుష్కరాల నిర్వహణలో భాగస్వాములను చేసి ఈ వేడుకను రాష్ట్రానికి ఒక గ్లోబల్ స్పిరిట్యువల్ అండ్ కల్చరల్ షోకేస్?గా నిలపాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

# కూటమిలో ఎవరి బలం ఎంత



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో కూటమిలో ఏ పార్టీ బలంగా ఉన్నాయంటే అన్నీ వేళ్లూ టీడీపీ వైపు చూపుతాయి. టీడీపీకి నాలుగు దశాబ్దాల చరిత్ర ఉంది. క్షేత్ర స్థాయిలో బలం ఉంది. తెలుగుదేశం పార్టీకి ఒకే ఒక మైనస్ సొంతంగా పోటీ చేసి ఎప్పుడూ గెలవకపోవడమే. అదే పొత్తులతో ఇప్పటి వరకూ చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. కానీ సీట్ల పంపకాల విషయంలో మాత్రం ఖచ్చితంగా టీడీపీదే పై చేయిగా ఉంటుంది. ఎందుకంటే బలం, బలగం అధికంగా ఉన్న తెలుగుదేశం పార్టీ రాజీ పడే అవకాశముండదు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను విస్మరించే అవకాశం లేదు. ఎన్నాళ్ల నుంచో కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్న ధోరణిలో ఉన్నారు. అందులోనూ టీడీపీకి అనుభవం ఉన్న చంద్రబాబు నాయకత్వం ఉంది. ఓడిపోయినా.. గెలిచి సత్తా చూపించిన చరిత్ర ఆ పార్టీది. అలాగే ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ఎప్పుడూ టీడీపీ రాష్ట్రంలో ఏ స్థానాల్లోనైనా రాజీ పడలేదు. ఎమ్మెల్సీ స్థానాలను కూడా తమ సంఖ్యకు అనుగుణంగా సాధించుకుంది. గత ఎన్నికల్లో 130కి పైగా స్థానాలను సాధించిన ఆ పార్టీకి ఎక్కువ స్థానాలను ఆశించడంలో తప్పులేదు. అలాగే కూటమిలోని విపక్షాలు అత్యాశకు పోవడం కూడా మంచిది కాదు. ఎందుకంటే.. స్థానిక సంస్థల ఎన్నికలు క్యాడర్ తో పాటు పార్టీని బలోపేతం చేసేవి కావడంతో ఖచ్చితంగా ఈ ఎన్నికలను సైకిల్ పార్టీ సవాల్ గా తీసుకుంటుంది. గత వైసీపీ పాలనలో పోటీ చేసి ఒక్క స్థానంలో గెలవలేదన్న కసి టీడీపీ నేతల్లోనూ, కార్యకర్తల్లోనూ కనిపిస్తుంది. ఆ అవకాశాన్ని ఇప్పుడు వదులుకోలేరు. చంద్రబాబు కూడా అందుకు అంగీకరించే అవకాశాలుండవు.బలమైన పార్టీ కావడంతో... ఏ పక్షమైనా తమ బలాన్ని బట్టి ముందుకు వెళితే ప్రత్యర్థి పార్టీని కట్టడి చేయవచ్చు. 175 నియోజకవర్గాల్లో బలంగా ఉన్న టీడీపీకి, మిగిలిన రెండు పార్టీలకు చాలా వ్యత్యాసం ఉంది. అవి కేవలం కొన్ని నియోజకవర్గాలు, కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యాయి. అందుకే ఇచ్చింది తీసుకోవడం మినహా మరో దారి కూటమిలోని మిగిలిన పార్టీలకు ఉండదు. అలాగని కూటమి నుంచి విడిపోతే రాజకీయ నష్టం కేవలం టీడీపీకే మాత్రం జరగదు. మిగిలిన జనసేన, బీజేపీలకు కూడా జరుగుతుంది. ఆ సంగతి చంద్రబాబుకు కూడా తెలియంది కాదు. అందులోనూ సరైన నాయకత్వం లేనప్పుడు మేయర్, ఛైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగితే టీడీపీకి తప్ప మిగిలిన రెండు పార్టీలకు సరైన నాయకత్వం లేదు. నిలబడి.. పోటీ చేసే నాయకుడు ఎవరు? అన్న ప్రశ్నకు వారి నుంచి సమాధానం రాదు. అదే టీడీపీకి బలమైన నాయకులు ప్రతి నియోజకవర్గంలో ఉన్నారు. అదే తేడా. అందుకే కుదరదు అంటూ బాబు కూటమిలోని మిగిలిన పార్టీల ప్రతిపాదనలను కొట్టిపారేసే అవకాశాలే ఎక్కువ ఉన్నాయి.

# సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న జగన్



**విజయవాడ :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండి పెద్ద తప్పు చేస్తున్నారు. వచ్చిన అంది వచ్చిన అవకాశాన్ని కూడా మిస్ చేసుకుంటున్నారు. బయట మీడియా సమావేశాలు పెట్టినంత మాత్రాన ఒరిగేదేంటి? అదే అసెంబ్లీలో రెండు నిమిషాలు మాట్లాడి వాకౌట్ చేసి బయటకు వస్తే ఎంతో కొంత రాజకీయ ప్రయోజనం లభించవచ్చు. అదే సమయంలో జగన్ ను వ్యక్తిగతంగా ఎవరైనా అధికార పార్టీ సభ్యులు దూషిస్తే ఆ సాకు చూపించి బహిష్కరించవచ్చు. సమయం ఇవ్వరంటూ ముందుగానే తనకు తానే నిర్ణయించుకుని అసెంబ్లి సమావేశాలను పూర్తిగా బహిష్కరించం కూడకా సక్రమం కాదు. గెలిచి అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన జగన్ కుంటిసాకులు చెబుతు తప్పించుకుంటున్నారన్న విమర్శలకు ఆయన సమాధానం చెప్పలేని పరిస్థితి ఉంది. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తే వస్తామని కండిషన్ పెట్టడం కూడా ఎవరూ హర్షించరు. శాసనసభ నియమ నిబంధనల మేరకే ప్రతిపక్ష హోదా ఇస్తారు. దీంతోపాటు తనకు సమయం ఇవ్వరని ముందునుంచే జగన్ వాదించి సభకు దూరంగా ఉండటం కూడా సరికాదు. అసెంబ్లీకి తనతో పాటు పది మంది ఎమ్మెల్యేలతో వస్తే సమయం ఇచ్చేది లేనిదీ తెలిసేది. సభకు హాజరై అప్పుడు సమయం ఇవ్వకుంటే నేరుగా అప్పుడే తనకు సభలో మాట్లాడేందుకు సమయం ఇవ్వకపోవడం వల్లనే సభకు రాలేకపోతున్నానని చెప్పుకునే వీలుంటుంది. అంతే తప్ప అసలు సభలో అడుగు పెట్టకుండానే, తనకు సమయం ఇవ్వరని జగన్ చెప్పడాన్ని కూడా ఎవరూ స్వాగతించారు. తాము 2024 ఎన్నికల్లో గెలిచి సభకు వెళ్లలేకపోతున్నామన్న బాధ వైసీపీ ఎమ్మెల్యేల్లోనూ కనపడుతుంది. చంద్రబాబు తాను సభకు హాజరు కాకపోయినా... పోనీ తాను సభకు హాజరు కాకపోతే పోనీ. మిగిలిన పది మంది ఎమ్మెల్యేలన పంపి అసెంబ్లీలో కొంత వాదన చేసి బయటకు వచ్చే వీలుంది. ఆ అవకాశాన్ని కూడా జగన్ చేజేతలా వదులుకుంటున్నారు. తనతో పాటు తన పార్టీ ఎమ్మెల్యేలు కూడా సభకు వెళ్లకూడదని గిరి గీయడం అంటే శాసించడమేనన్న వాదనకు మరింత బలం చేకూరుతుంది. జగన్ శాసనసభకు గైర్హాజరు అతి పెద్ద తప్పిదమని (బ్లండర్ మిస్టేక్) అధికార కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా, తప్పులను వివరించలేక జగన్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నారని సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ అంశాలపై సభలో సమాధానం చెప్పకుండా పారిపోతున్నారని అధికార పక్షం విమర్శిస్తోంది. ప్రజల తరఫున నిలదీయాల్సిన అసెంబ్లీ వేదికను వైఎస్సార్సీపీ బహిష్కరించడం రాజకీయంగా నష్టదాయకమని విశ్లేషకులు భావిస్తున్నారు.అసెంబ్లీకి వైఎస్ జగన్ ఎందుకు దూరంగా ఉంటున్నారనే ప్రశ్నకు బహుశా ఆయన వద్దనే సమాధానం ఉండి ఉండకపోవచ్చు.

## క్లీన్ ఎనర్జీలో సౌదీ అరేబియాలా ఏపీ

-మొదటిపేజీ తరువాయి

సామర్థ్యంతో కూడిన పరిశ్రమలను నెలకొల్పామని లోకేశ్? తెలిపారు. ఈ సంఖ్యను రెట్టింపు చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్న లోకేశ్ భవిష్యత్తులో ఏపీనే నెంబర్ వన్‌గా ఉండాలనే టార్గెట్‌ను నిర్దేశించుకున్నామని చెప్పారు. ఆ దిశలో కార్యాచరణను వేగవంతం చేశామని తెలిపారు. 2030 నాటికి 5 వేల మెగావాట్ల అదనపు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల స్థాపన లక్ష్యంగా సుజ్లాన్ సంస్థ ప్రణాళికలు రచించిందన్నారు. పెట్టుబడులతో ఏపీకి వచ్చే వారికి సింగిల్ విండోలో అనుమతులు ఇస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం మనం అధిక మొత్తంలో చమురును దిగుమతి చేసుకుంటున్నామని, దానికి ప్రత్యామ్నాయాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఉందని లోకేశ్? అన్నారు. ఇంధనరంగంలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ మాలిక్యూల్స్ ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ రంగంలో ‘సౌదీ అరేబియా’గా మారగలదని నేను విశ్వసిస్తున్నా.కేవలం ఇండియాకు మాత్రమే కాదు మొత్తం ప్రపంచానికే క్లీన్ ఎనర్జీని అందివ్వగలదని మా నమ్మకం. ముఖ్యమంత్రి విజన్ ఇది. మీకు తెలుసు ఆయన దూరదృష్టి ఉన్న నాయకుడు. ఆయన నిద్రపోరు, మనల్ని నిద్రపోనివ్వరు. అటువంటి పట్టుదల ఆయనకు ఉంది. ఇక్కడ పవర్ సెక్టార్‌కు చెందిన వారు చాలా మంది ఉన్నారు. టాటా, వారీ , యాక్సిస్‌తో పాటు సుజ్లాన్ మీరందరూ కలిసి ఈ ఎకోసిస్టమ్‌ను సృష్టించగలరని నేను భావిస్తున్నా. మీ అందరితో కలిసి పని చేయడానికి ఎదురుచూస్తున్నాం. మీకు ఏవైతే సమస్యలు ఉన్నాయో వాటన్నింటినీ పరిష్కరిస్తాం.

సుజ్లాన్‌కు ఆంధ్రప్రదేశ్ అనేది కేవలం ఒక మార్కెట్ మాత్రమే కాదని రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న వ్యూహాత్మక అనుబంధమని సుజ్లాన్ గ్రూప్ కో ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో, పవన, సౌర, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో ఏపీ కీలక కేంద్రంగా ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## గ్రేట్ గ్రీన్ వాల్‌లో తాటి వనాలు

-మొదటిపేజీ తరువాయి

అడవులకు, రెండో అంచె తాటి వనాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు పవన్ తెలిపారు.

**ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం**

ప్రకృతి విపత్తుల నుంచి తీర ప్రాంతాన్ని రక్షించడం, వాటి వల్ల కలిగే నష్టాన్ని తగ్గించటమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర అటవీ శాఖ “గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (మహా హరిత కుడ్యం)” ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రాష్ట్రంలోని మొత్తం తీరప్రాంతం పొడవునా 5 కిలోమీటర్ల వెడల్పుతో పర్యావరణ కారిడార్ ఏర్పాటు చేయనుంది. దీన్ని తీరానికి బయోషీల్డ్‌గా (జీవ రక్షణ కవచం) తీర్చిదిద్దనుంది. మొత్తం 3 జోన్లతో గ్రేట్ గ్రీన్ వాల్‌ను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే కార్యాచరణ మొదలైంది.

తీరప్రాంతానికి 5 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న ప్రజలు తరచూ తుపానులు, సునామీలు, వరదలు, సముద్రమట్టం పెరుగుదల, తీరప్రాంత కోత ప్రమాదాలు ఎదుర్కొంటున్నారు.

కృష్ణా–గోదావరి డెల్టాల్లోకి ఉప్పు నీరు చొచ్చుకుపోకుండా కాపాడే సహజ రక్షణ కవచాలైన నదీ ముఖద్వారాల పరిసర ప్రాంతాల్లో సముద్రపు కోత తీవ్రంగా ఉంది. దీని వల్ల భూమిని కోల్పోతున్నాం. పర్యావరణ వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. వరదలు పెరుగుతున్నాయి.

తుపానులు, వరదల వల్ల పంటలు, పశుసంపదతో పాటు మత్స్యకార మౌలిక వసతులకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. కలుషిత నీరు, క్షీణిస్తున్న వ్యవసాయ భూములు ఆహార సరఫరా వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి.

ఈ తరహా సహజ విపత్తుల నుంచి రక్షించేందుకు ‘గ్రేట్ గ్రీన్ వాల్’ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. గ్రేట్ గ్రీన్ వాల్‌ను పూర్తి చేసి దేశంలోనే ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలుపుతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పదే పదే చెబుతున్నారు.

**3 జోన్లతో ఏర్పాటు:**

జోన్–1: సముద్ర దిశ వైపునున్న అంచు (సీవార్డ్ ఎడ్జ్): నదీ ముఖద్వారాల వద్ద మడ అడవులు పెంచుతారు. నదీ ముఖం కాని ప్రాంతాల్లో షెల్టర్ బెల్ట్‌లు (చెట్ల వరసలు లేదా పొదల సమూహం) ఏర్పాటు చేస్తారు.

జోన్–2: గాలి నిరోధకాలు (విండ్ బ్రేక్స్): కాలువగట్లపై భారీ ఎత్తున మొక్కలు నాటతారు. రహదారులకు ఇరువైపులా మొక్కలు పెంచుతారు

జోన్–3: కమ్యూనిటీ బఫర్: ఆగ్రో ఫారెస్ట్రీ కింద సాగు చేయిస్తారు. ప్రజా భాగస్వామ్యంతో వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతారు.

## జూడాల సమ్మె విరమణ

-మొదటిపేజీ తరువాయి

ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలి.

3 దశలుగా ఆందోళనలు: ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీ జూడా) ఆధ్వర్యంలో ఈనెల 11న తొలిదశ, 12 నుంచి రెండోదశ ఆందోళనలు కొనసాగాయి. అత్యవసర సేవలు మాత్రమే అందిస్తూ 16వ తేదీ వరకు నిరసనలు తెలిపారు. 15% స్టైపెండ్ పెంచాలన్న జూడాల డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గకపోవడంతో ఈనెల 17 నుంచి మూడో దశ ఆందోళనలో భాగంగా అత్యవసరంతోపాటు అన్ని సేవలూ నిలిపివేసి సమ్మెను తీవ్రతరం చేశారు. రోగులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం సెకండరీ, పబ్లిక్ హెల్త్ పరిధి ఆసుపత్రుల్లోని వైద్యులను ప్రత్యామ్నాయంగా అందుబాటులోకి తెచ్చింది. బోధనాసుపత్రుల్లో రోజువారీ ఓపీ, ఐపీ, శస్త్రచికిత్సలు, డయాలసిస్, ట్రామా సేవలకు ఇబ్బంది కలగకుండా పర్యవేక్షిస్తోంది. జూడాలతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పలు దఫాలుగా చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో సమ్మె కొనసాగించారు. నేటితో వారి నిరసన ముగిస్తున్నట్లు తెలుస్తుంది.

# ఇక పచ్చటి ప్రకాశం

**ఒంగోలు :** ఫ్లోరైడ్ రక్కసి కోరల్లో చిక్కుకుని, తీవ్ర కరవుతో అల్లాడిపోయిన పశ్చిమ ప్రకాశం నేలలకు జీవనాడి అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కల ఎట్టకేలకు సాకారమవుతోంది. మూడు దశాబ్దాల క్రితం 1996లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మళ్లీ తన చేతుల మీదుగానే తొలి దశను జాతికి అంకితం చేసే స్థాయికి తీసుకురావడం ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగ చరిత్రలో ఒక అద్భుత ఘట్టం. ప్రకాశంతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని లక్షలాది ఎకరాలకు సాగునీరు, సుమారు 23 లక్షల మందికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సంకల్పం నేడు సంపూర్ణ వాస్తవ రూపం దాల్చింది.వెలిగొండ ప్రాజెక్టు ప్రస్థానాన్ని నిశితంగా గమనిస్తే.. చంద్రబాబు అధికారంలో ఉన్న కాలంలోనే ఈ ప్రాజెక్టు పనులు పరుగులు తీశాయి. నల్లమల అడవుల గుండా అత్యంత సంక్లిష్టమైన రెండు భారీ సొరంగాలను తవ్వి కృష్ణా జలాలను తరలించే ఈ ఇంజనీరింగ్ అద్భుతాన్ని గత పాలకులు ఖర్చు దండగ అనుకుంటూ తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఎన్నికల ముందు అరకొర పనులతో ప్రారంభోత్సవాల డ్రామాలు ఆడినప్పటికీ, క్షేత్రస్థాయిలో నీటిని నింపే పనులు మాత్రం ముందుకు సాగలేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టువదలని విక్రమార్కుడిలా చంద్రబాబు నిధుల కొరతను అధిగమించి, గత రెండేళ్ల కాలంలోనే రూ.2,250 కోట్లకు పైగా వెచ్చించి మొదటి దశ పనులను శరవేగంగా కొలిక్కి తెచ్చారు.చరిత్రలో ఏ భారీ నీటిపారుదల ప్రాజెక్టులోనూ లేని విధంగా, జలాశయంలోకి నీటిని విడుదల చేయడానికి ముందే ముంపు బాధితులకు పునరావాసం, పరిహారం పూర్తి చేయడం చంద్రబాబు ప్రభుత్వ మానవీయ దృక్పథానికి నిదర్శనం. గతంలో ప్రాజెక్టులు పూర్తయినా నిర్వాసితులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే దుస్థితి ఉండేది. కానీ వెలిగొండ విషయంలో ఆ పరిస్థితి రానివ్వకుండా, ప్రాజెక్టును ప్రారంభించే సమయానికే మూడో విడత కింద రూ.250 కోట్ల పరిహారం విడుదల చేశారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 6,206 ముంపు కుటుంబాలకు రూ.768 కోట్లకు పైగా చెల్లించి, దాదాపు 85 శాతం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని పారదర్శకంగా పూర్తి చేసి బాధితుల కన్నీళ్లు తుడిచారు.నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారం అందించి వారిని ఆదుకోవడంతో పాటు, అటు దశాబ్దాలుగా చుక్క నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు సాగునీరు అందించే ఏర్పాట్లు చేయడంతో ఇటు నిర్వాసితులు, అటు అన్నదాతలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నల్లమల సాగర్ జలాశయం ద్వారా కరవు నేలలు సస్యశ్యామలం కాబోతుండటం ప్రాంతీయ అభివృద్ధికి నూతన ఊపునిస్తోంది. చిత్తశుద్ధి, సంకల్ప బలం ఉంటే ఎన్ని అడ్డంకులు ఎదురైనా దశాబ్దాల చిరకాల స్వప్నాన్ని సాకారం చేయవచ్చని నిరూపిస్తూ.. చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ, ప్రకాశం ప్రాంత ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు.

# పాయకరావుపేట శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఘనంగా “ఇన్వెస్టిచర్ సెర్మనీ-2026 కార్యక్రమం,,

**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,,ఆగస్టు 25 :** పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో మంగళవారం ఇన్వెస్టిచర్ సెర్మనీ- 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎస్ఐ మహమ్మద్ ఆలీ, ఏఎస్ఐ జె గోవిందరావు హాజరయ్యారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన స్కూల్ క్యాబినెట్ సభ్యులకు బ్యాడ్జ్‌లను ప్రదానం చేసి అభినందించారు. విద్యార్థులు తమకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఏజిఎం సురేష్, ఆర్ఐ గోపీనాథ్ నూతన క్యాబినెట్ సభ్యులను అభినందించి నాయకత్వ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ పి రామరాజు మాట్లాడుతూ... నాయకత్వం



అనేది కేవలం ఒక పదవి కాదని, అది బాధ్యత, సేవాభావం, క్రమశిక్షణ మరియు ఇతరులకు మార్గదర్శకంగా నిలిచే గొప్ప అవకాశం అని చెప్పారు. విద్యార్థులు తమ ప్రతిభను సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ మనీష్, సి ఇంచార్జి శ్రీనివాస్, ఎఒ విజయ్, ప్రైమరీ ఇంచార్జి కల్పన, ప్రీ ప్రైమరీ ఇంచార్జి గౌరీదేవి, 10 వ తరగతి ఇంచార్జి త్రిమూర్తులు, పిఇటిలు గణేష్, సువర్ణరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం 2 ఏళ్ల అభివృద్ధి -- సంక్షేమంపై విస్తృత ప్రచారం.

కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ

**మచిలీపట్నం ఆగస్టు 25(మీ వార్త ప్రతినిధి)** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ఈ రోజు బందరు మండలం కరగ్రహారం గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బూత్ నంబర్లు 39, 40 పరిధిలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. ప్రజల



సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ప్రత్యేకంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అబ్దుల్ అజీమ్ గారికి ?23,400 ఆర్థిక సహాయం అందిన విషయాన్ని ప్రజలకు వివరించారు. పేదలు, అవసరంలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ తలారి సోమశేఖర్, పరసా వడ్డీ కాసులు, బత్తిన నాగరాజు, బోలెం అయోధ్య, వల్లభుని నాగుల్‌మీరా, బొర్రా రాము, ఈడే వెంకటేశ్వరరావు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం -- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం... ప్రజలే ప్రథమ ప్రాధాన్యం!

# 4 టీమ్ ఆధ్వర్యంలో జూన్--జులై నెలల న్యూస్‌లెటర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు..

**జీలుగుమిల్లి.. (మీ వార్త ప్రతినిధి)** పోలవరం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో ా4 టీమ్ ఆధ్వర్యంలో రూపొందించిన జూన్--జులై నెలల న్యూస్‌లెటర్‌ను గౌరవ పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మంగళవారం బర్రింకలపాడు గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. పోలవరం నియోజకవర్గంలో జూన్ - జులై లో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన ముఖ్యాంశాలను ఈ న్యూస్‌లెటర్‌లో పొందుపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, పోలవరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రజలకు చేరాలనే ఉద్దేశంతో న్యూస్‌లెటర్‌ను రూపొందించడం జరిగిందని



తెలిపారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ా4 యంగ్ ప్రొఫెషనల్ జగదీశ్వరరావు, టీమ్ సభ్యుడు సాయి తదితరులు పాల్గొన్నారు..

# మెయినాబాద్‌లో రహస్యభేటీ...

**హైదరాబాద్ :** లండన్ పర్యటన ముగించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చారు. శంషాబాద్ విమనాశ్రయంలో ఆయనకు కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. సాయంత్రం రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించబోతున్నారు. ఈ సమావేశంలో రేవంత్ ఏం మాట్లాడబోతున్నారనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. సురేఖ వ్యవహారం, అమెరికా వెళ్లడానికి కేంద్ర విదేశాంగ శాఖ మోకాలడ్డటం వంటి పరిణామాలపై రేవంత్ రెడ్డి ఎలా మాట్లాడతరనేది ఆసక్తికరంగా మారింది. రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశానికంటే ముందే తెలంగాణ రాజకీయా లలో సంచలన పరిణామాలు చోటు చేసుకుందని వార్తలు వినిపిస్తున్నాయి. గులాబీ పార్టీకి అనుకూలంగా ఉండే కొన్ని సోషల్ మీడియా గ్రూపులు.. ముఖ్యంగా ఎక్స్ హ్యాండిల్స్ లో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. అందులో ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 20 మంది ఎమ్మెల్యేలతో ప్రచారం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత రాజకీయాలు జరుగుతున్నాయ.. ఇవి చర్చనీయాశంగా మారిపోయారని.. మొయినాబాదులోని ఒక వ్యవసాయ క్షేత్రంలో రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో సుమారు 20 మంది ఎమ్మెల్యేలు రహస్యంగా సమావేశం అయ్యారని ప్రచారంలో ఉంది. ఈ సమావేశంలో ఆ 20 మంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలి



మీద.. ముఖ్యంగా కొంతమంది వ్యక్తులు సాగిస్తున్న ఆధిపత్యం మీద తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రచారం జరుగుతుంది. అవసరమైతే ప్రభుత్వం ఇబ్బందుల్లో పడినప్పటికీ.. తమ ధోరణి మార్చుకునే అవకాశం లేదని వారు చెప్పినట్టు గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులలో ప్రచారం జరుగుతోంది. మొయినాబాద్ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఈ సమావేశానికి కొంతమంది సీనియర్ మంత్రులు సపోర్ట్ చేసినట్టు తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రి.. ముఖ్యమంత్రి సొంత జిల్లా చెందిన ఒక మంత్రి.. రంగారెడ్డి.. నల్గొండ జిల్లాలకు చెందిన కొంతమంది సీనియర్ ఎమ్మెల్యేలు.. ఉమ్మడి పాలమూరు జిల్లా చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు ఇందులో పాల్గొన్నట్టు గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులలో ప్రచారం జరుగుతుంది ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 64 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఒకవేళ ఆ 20 మంది ఎమ్మెల్యేలు తాటి మీదికి వస్తే.. రాజకీయంగా ప్రభావం చూపించే అవకాశం ఉందని.. కెసిఆర్ ను మరోసారి ముఖ్యమంత్రి చేస్తారని గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులో సొంత డబ్బా కొట్టుకుంటున్నాయిఇక ఇటీవల రేవంత్ రెడ్డి ఫారిన్ టూర్ కు సంబంధించిన వ్యవహారాలు కూడా ఆసక్తికరంగా మారాయి. ఆయన అమెరికా టూర్ రద్దయింది. గడ్డం నుంచి నేరుగా ఆయన హైదరాబాద్ వచ్చారు. దీనిపై రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. సరే గవర్నమెంట్ పర్మిషన్ ఇవ్వకపోవడంతో ఆయన టూర్లో ఆకస్మికంగా మార్పులు జరిగాయి. అయితే కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత పరిణామాలు కూడా దీనికి కారణమని గులాబీ పార్టీ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా క్యాబినెట్ విస్తరణ కూడా వాయిదా పడుతూ వస్తోంది. మినిస్టర్ పదవులు ఆశిస్తున్న కొంతమంది సీనియర్ లీడర్లు తీవ్రమైన అసంతృప్తిలో ఉన్నారు. మొయినాబాద్ వ్యవసాయ క్షేత్రంలో జరుగుతున్న సమావేశం లో నిజం ఎంత.. దీని వెనక గులాబీ పార్టీ సోషల్ మీడియా ఎందుకు ఈ స్థాయిలో ప్రచారం చేస్తోంది.. రాజగోపాల్ రెడ్డి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారా.. అనే విషయాలపై క్లారిటీ రావాలంటే కాస్త సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

# 7 నుంచి అసెంబ్లీ

**హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల సమయంలో ఈ సమావేశాలు నిర్వహించనుండటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తొలి రోజు సమావేశం అనంతరం స్పీకర్ నేతృత్వంలో జరిగే శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ భేటీలో ఉభయ సభలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ ప్రభుత్వం పలు కీలక బిల్లులు, విధానపరమైన నిర్ణయాలను సభ ముందు ఉంచే అవకాశం ఉందని

## వివాహ వేడుకలో పాల్గొని వధువును ఆశీర్వదించిన తెల్లం రాజ్యలక్ష్మి

పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

**పోలవరం మీ వార్త ఆగస్టు 25** కొత్త తుటిగుంట: ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గంలోని కొత్త తుటిగుంట గ్రామానికి చెందిన కుండ్ల వీరభద్రరావు కుమార్తె వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు సతీమణి



తెల్లం.రాజ్యలక్ష్మి,పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, బుట్టాయిగూడెం మండల కన్వీనర్ అల్లూరి రత్నజీ, కణితి దుర్గారావు, కొత్తూరి బాబురావు తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు హాజరై నూతన దంపతులకు శు భాకాంక్షలు తెలిపారు.

## పోలవరం పంచాయతీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ముసాయిదా జాబితా సిద్ధం

పంచాయతీ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ

**పోలవరం మీ వార్త ఆగస్టు25** పోలవరం మండలంలోని పోలవరం గ్రామపంచాయతీ ప్రజలకు ముఖ్య సమాచారం విడుదల చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ముసాయిదా జాబితాను సిద్ధం చేశారు. రెడ్ పెన్నుతో మార్క్ చేసిన ముసాయిదా జాబితాను



పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. ప్రజలు పంచాయతీ కార్యాలయానికి హాజరై జాబితాను పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలను ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని సూచించారు. అభ్యంతరాలు, సూచనలు ఉంటే ఆగస్టు 28వ తేదీలోపు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజలు నిర్ణీత గడువులోగా పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ప్రజల అభ్యంతరాలను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.

## అన్నా క్యాంటీన్ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు..





**జీలుగుమిల్లి. (మీ వార్త ప్రతినిధి)** జీలుగుమిల్లి మండల కేంద్రంలో నిర్మాణం చివరి దశలో ఉన్న అన్నా క్యాంటీన్ భవనాన్ని పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ చిర్రి బాలరాజు మంగళవారం సందర్శించి, అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే ఈ భవన నిర్మాణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా, అత్యున్నత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్నా క్యాంటీన్ ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన సేవలను అందించే కేంద్రంగా మారనున్నందున, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సంబంధిత అధికారులను కోరారు. ప్రజలకు నాణ్యమైన, తక్కువ ధరకు భోజనం అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన అన్నా క్యాంటీన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బాలరాజు అన్నారు. .

## కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం

**అంబాజీపేట, ఆగస్టు 25 ( మీ వార్త విలేఖరి ):** మండల పరిధిలోని 119 ,122 బూత్ లలో“రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి సంక్షేమం” కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ



కార్యక్రమాలు, పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. తెలుగుదేశం పార్టీపై ప్రజలు ఉంచుతున్న నమ్మకానికి, చూపిస్తున్న అభిమానానికి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలుతెలియజేసారు . ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, తెలుగు యువత అధ్యక్షులు జోగి కృష్ణ చైతన్య, కో యూనిట్ ఇంచార్జ్ బొచ్చు చినబాబు,,బూత్ కన్వీనర్ ముష్టి వెంకట రాజేశ్వర్ శర్మ,కొప్పినీడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్షలను రద్దు చేయాలి : యుటిఎఫ్



**తాడేపల్లిగూడెం ఆగస్టు 25 (మీ వార్త ప్రతినిధి)** యూటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు తాడేపల్లిగూడెంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నుండి ఊరేగింపుగా తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ ఎం సునీల్ కుమార్ కు యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. తదుపరి బైక్ ర్యాలీ ప్రదర్శనతో ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2010 సంవత్సరానికి ముందు ఉద్యోగంలో చేరిన వారంతా డీఎస్సీ పరీక్షలు రాసిన వారేనని, తిరిగి వారికి పరీక్షలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. తమిళనాడు ప్రభుత్వం మాదిరిగా మన రాష్ట్ర ప్రభుత్వం కూడా టెట్ పరీక్షను వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శివప్రసాద్, రత్నరాజు, రాష్ట్ర కార్యదర్శి శ్రీదేవి, తాడేపల్లిగూడెం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతిరావు, ఎస్.ఎన్. శ్రీనివాసరావు, పెంటపాడు మండల శాఖ గౌరవ అధ్యక్షులు మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షులు తేజస్వి, అలీషా తదితరులు పాల్గొన్నారు.

## మిత్రునికి కన్నీటి వీడ్కోలు.........



**పెడన ఆగస్టు 25(మీ వార్త ప్రతినిధి)** అనారోగ్యంతో అకాల మరణం చెందిన పెడన ప్రెస్ క్లబ్ ట్రెజరర్ శ్రీ పృథ్వి కోటయ్య గారికి పెడన ప్రెస్ క్లబ్ సభ్యులు ఘన నివాళులు అర్పించారు. పెడన ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు శ్రీ నక్కా. రాజేంద్రప్రసాద్, అధ్యక్షులు పివి రావు, ఉపాధ్యక్షులుకటికల. నాగవర ప్రసాద్ కార్యదర్శి ప్రత్తిపాటి వెంకటరమణ ,మరో ఉపాధ్యక్షులు సిటీకేబుల్ జగన్ లు పాల్గొని మిత్రులు పృథ్వి కోటయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు రాష్ట్ర చేనేత కార్మిక సంఘం మాజీ అధ్యక్షులు కట్టా. హేమ సుందర్ రావు పాల్గొని కోటయ్యకు ఘన నివాళులు అర్పించారు.

## పాత మేడపర్తిలో బురద నీరే శరణ్యం.

రోగాల బారిన గిరిజనులు.

ఆరు నెలలుగా మొరాయించిన బోరు.

పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి.

సమస్య పరిష్కరించకుంటే ఎంపీడీవో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక.





**అనంతగిరి,ఆగస్టు 25 ( మీ వార్త )** అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని పెద్దబిడ్డ పంచాయతీ పరిధిలో గల పాత మేడపర్తి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది.మంచినీటి కోసం గ్రామస్తులు, ముఖ్యంగా మహిళలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.సుమారు 40 గిరిజన కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామానికి తాగునీటి కోసం ఒకే ఒక్క బోరు బావి ఏకైక ఆధారంగా ఉంది. అయితే,గత ఆరు నెలలుగా ఆ బోరు బావి సరిగ్గా పనిచేయకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో ఉన్న ఒకే ఒక్క బోరు బావి కూడా పాడైపోవడంతో నాణ్యమైన నీరు రావడం లేదని,అప్పుడప్పుడు కేవలం బురద నీరే వస్తోందని గ్రామ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత్యంతరం లేని పరిస్థితుల్లో అడవిలోని ఊట నీటిని తెచ్చుకుని తాగాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. కలుషితమైన ఈ ఊట నీటిని కాచుకుని తాగుతున్నప్పటికీ..చిన్న పిల్లలు,వృద్ధులు వాంతులు, విరేచనాలు వంటి భయంకరమైన అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి ఏ క్షణంలో ఏ రోగం ముంచుకొస్తుందోనని గ్రామ ప్రజలు నిత్యం బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం:తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ స్థానిక పంచాయతీ కార్యదర్శి కి గ్రామస్తులు స్వయంగా కలిసి మొరపెట్టుకున్నారు. అయినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంపై గిరిజనులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత ఉన్నతాధికారులు సైతం ఈ సమస్యను పట్టించుకోకపోవడం అత్యంత బాధాకరమని వారు వాపోతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిద్ర మత్తు వీడి,యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి పాత మేడపర్తి గ్రామ తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోని పక్షంలో..గ్రామస్తులమంతా ఏకమై అనంతగిరి ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించక తప్పదని వారు తీవ్రంగా హెచ్చరించారు.

## పెడన హిందూ స్మశాన వాటిక అభివృద్ధి నిర్మాణం

సి ఎస్ ఆర్ నిధుల( హడ్కో సంస్థ) నుండి రూ.1.40 కోట్లు మంజూరు



**మచిలీపట్నం ఆగస్టు 25(మీ వార్త ప్రతినిధి)** పెడన హిందూ స్మశాన వాటిక అభివృద్ధి నిర్మాణ పనుల నిమిత్తం సి ఎస్ ఆర్ నిధుల( హడ్కో సంస్థ) నుండి రూ.1.40 కోట్లు మంజూరు అయినట్లు పార్లమెంట్ సభ్యులు శ్రీ వల్లభనేని బాలశౌరి తెలిపినారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయం నుండి కమిటీ కు సమాచారం అందటంతో కమిటీ సభ్యులు,పెద్దలు మచిలీపట్నంలోని ఎంపీ శ్రీ వల్లభనేని బాలశౌరి ని వారి కార్యాలయంలో కలిసి నిధులు విడుదల లో సహకారం అందించిన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బొడ్డు వేణుగోపాలరావు,బొడ్డు దీక్షానందుడు, వాసా సాంబశివరావు, ఊటుకూరి ప్రకాశరావు, కొసనం లోకనాధం,బళ్ల ప్రసాద్,చందన నారాయణరావు,పిచ్చుక కోటేశ్వరరావు, కమ్మగంటి వెంకటేశ్వరావు తమ్మా భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు ఆశ్రమ హాస్పటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

డాక్టర్ మణికంఠేశ్వరన్..




**జీలుగుమిల్లి.( మీ వార్త ప్రతినిధి )**ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏలూరు ఆశ్రమ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ మణికంఠేశ్వ రన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలలో వచ్చు గర్భ కోస మరియు బ్రెస్ట్ క్యాన్సర్ ను ప్రథమ దశలో గుర్తించి వైద్య సేవలు అందించినట్లు ఆయన తెలిపారు. . స్త్రీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరానికి సుమారు 150 మంది మహిళలు హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారని ఆయన అన్నారు. 52 మందికి ఎక్స్ రే 46 మందికి స్కానింగ్ 33 మందికి ఈ సీజీ తదితర పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 12 మంది నీ తదుపరి పరీక్షల కోసం ఏలూరు ఆశ్రమ హాస్పటల్ కు పంపించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పవన్ కుమార్ .సిహెచ్ఓ శ్రీనివాసరాజు. పీహెచ్ఎన్ నాగమణి. హెల్త్ అసిస్టెంట్ కూరం ప్రసాద్. ఏఎన్ఎంలు. ఆశా కార్యకర్తలు ఆశ్రమ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు. .

## మల్లవోలు పి ఏ సి ఎస్ సంఘం, కె డి సి సి బ్యాంకు మట్టి ఖర్చుల పది వేల రూపాయలు ఆర్థిక సహాయం



**గూడూరు ఆగస్టు 25(మీ వార్త ప్రతినిధి)** గూడూరు మండలం, మల్లవోలు పి ఏ సి ఎస్ సంఘ సభ్యులైన శ్రీ ప్రత్తిపాటి వెంకయ్య మృతి చెందడం పట్ల మేము తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నాము. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. ఓం శాంతిః మల్లవోలు పి ఏ సి ఎస్ సంఘం తరపున, కె డి సి సి బ్యాంకు వారి సౌజన్యంతో మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10,000/- (పది వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మల్లవోలు పి ఏ సి ఎస్ సంఘ చైర్పర్సన్ శ్రీ ముద్దినేని వెంకటేశ్వరరావు పర్సన్స్ శ్రీ పూల నాగరాజు శ్రీ కంచర్ల అబ్రహం,అంతర్జాతీయ మానవ హక్కుల యూత్ ప్రెసిడెంట్ శ్రీ పడవల మోహన్ త్రినాధ్ మరియు గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొనినివాళులర్పించారు.

## ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ 10 వ రోజు వంటా వార్పు కార్యక్రమం ,,




**పాయరావుపేట, మీ వార్త ప్రతినిధి,,ఆగస్టు 25** : పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట అంబేద్కర్ కోలనీలో నివసిస్తున్న పేదలు 10 వ రోజు వంటా వార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఎం సత్యనారాయణ, బత్తిన నాగేశ్వరరావు మాట్లాడుతూ... వంటా వార్పు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న పేదలను అభినందించారు. ఈ నెల 24 న అనకాపల్లి కలెక్టరేట్ దగ్గర జరిగిన ధర్నాకు వచ్చినందుకు అభినందించారు. ప్రభుత్వం వెంటనే అందరినీ పేదలుగా గుర్తించి నివాసం ఉన్న చోటే ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలని, మంచినీటి సౌకర్యం, కరెంటు, రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని అందరికీ దోమల తెరలు సప్లై చేయాలని, సులబ్ కాంపక్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ నిర్మల, వై వేళాంగిణి, డి బుజ్జి, లోవమ్మ, మణి, కె భారతి, జివిస్ రత్నం, ఆకుల లత, వై అంజమ్మ ,నందు, కు షల,తదితరులు పాల్గొన్నారు.

## పజా విశ్వాసమే సమర్ధవంతమైన పోలీసింగ్‌కు పునాది..

**క్షేత్రస్థాయిలో పోలీసింగ్ బలోపేతమే లక్ష్యం:**

**ఎస్పీ డా. శబరీష్,**




మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని కిట్‌లను, రికార్డులను, వివిధ గదులను, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రిసెప్షన్‌ను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలు, స్టేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్క సిబ్బందితో ఎస్పీ స్వయంగా మాట్లాడి, వారి విధి నిర్వహణ, ఎదురవుతున్న డ్యూటీ సంబంధిత సమస్యలు, వ్యక్తిగత సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తనతో స్వేచ్ఛగా పంచుకోవచ్చని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిబ్బందికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా రొటీన్ హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు

## శ్రీశాంకరీ దుర్గా పీఠం 20వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న బొడ్డు వెంకటరమణ చౌదరి





**కోరుకొండ ఆగస్టు 25( మీ వార్త ప్రతినిధి)** తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాడాల గ్రామంలో శ్రీ శాంకరీ దుర్గా పీఠం 20వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రాజమహేంద్రవరం రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శాంకరీ దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలందరూసుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పీఠం నిర్వాహకులు చేపట్టిన ఆధ్యాత్మిక కార్యక్రమాలను బొడ్డు వెంకటరమణ చౌదరి అభినందించారు.ఈ కార్యక్రమంలో పడాల పండు,దిడ్డి మాదవరావు,పద్దరాజు,వెంకటేశ్వరరావు,పీఠాధిపతులు,భక్తులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సత్యవరంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం,,,





**పాయకరావుపేట, ఆగస్టు : మీ వార్త ప్రతినిధి,,**మండలంలోని సత్యవరంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి పి ఆదినారాయణ, బీసీటీ సైంటిస్ట్ నాగేంద్ర, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి ఆదినారాయణ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి నాట్లలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించడంతో పాటు తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రాంతానికి అనుకూలమైన ఆరుతడి పంటల సాగు ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. నాగేంద్ర మాట్లాడుతూ... మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటల సంరక్షణ, నీటి వినియోగంలో పొదుపు చర్యలు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వి హెచ్‌ఏ సెరగడం వెంకట అప్పారావు, రైతులు పడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ ఢిల్లీలో బిసి కమిషన్ చైర్ పర్సన్ కు వినతిపత్రం అందజేసిన అశోక్ చక్రవర్తి ,,



**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,,**ఆగస్టు 25 : మండలంలోని పాల్మన్ పేట గ్రామానికి చెందిన మత్స్యకార నాయకుడు మైలపల్లి అశోక చక్రవర్తి మంగళవారం న్యూ ఢిల్లీలోని మోతీబాగ్ బంగ్లా నంబర్ 14 లో జాతీయ బిసి కమిషన్ చైర్ పర్సన్ సాధ్వి నిరంజన్ జ్యోతిని ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ బిసి కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను వివరిస్తూ బిసి వర్గాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని. వినతిపత్రం అందజేశారు. బిసిలకు విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. వెనుకబడిన బిసి వర్గాల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కోరారు. బిసిల్లోని ప్రతీ కులం సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలపై తాను అందజేసిన వినతిపత్రాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని బిసి కమీషన్ చైర్ పర్సన్ సాధ్వి నిరంజన్ జ్యోతి హామీ ఇచ్చారని అశోక్ చక్రవర్తి తెలిపారు.

## మంగవరం పి హెచ్ సి డాక్టర్లు ఆధ్వర్యంలో అరట్లకోటలో వైద్య శిబిరం ,,



**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,,**ఆగస్టు 25 : మండలంలోని అరట్లకోట పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మంగవరం పి హెచ్ సి డాక్టర్లు ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం జరిగింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "టిబి-ముక్త భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఈ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కట్టా శ్రీను, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మల గణేష్, టిడిపి సీనియర్ నాయకుడు కుందూరు కూమార్, డాక్టర్ పి అభిలాష్ (టీబీ సూపర్ వైజర్), పి రాధిక (టీబీ లాబ్ సూపర్ వైజర్), పి రాముడు (ఎంపిహెచ్ఇఒ), కె శ్రీనివాసరావు ఎంపిహెచ్ యస్ (ఎం), డి కూమారి (ఏఎన్ఎం), జె కృష్ణ-ఎంపిహెచ్ఎ (ఎం), యస్ దుర్గ-ఎంఎల్ హెచ్ పి, పి మోనిక-ఎంఎల్ హెచ్ పి, ఎం జ్యోతి- ఆశా వర్కర్, ఎం నారాయణమ్మ-ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన 'జ్ఞాన జ్యోతి' రెండో విడత శిక్షణ.

అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యకు పెద్దపీట.

అనంతగిరి ఐసీడీఎస్ పీఓ ఎన్ సుగుణ.





**అనంతగిరి,ఆగస్టు 25 ( మీ వార్త )** అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మరింత మెరుగైన విద్యా బోధన అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,ఇందులో భాగంగానే 'జ్ఞాన జ్యోతి' రెండో విడత శిక్షణా తరగతులను విజయవంతంగా నిర్వహించినట్లు అనంతగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్ సుగుణ ఒక ప్రకటనలో తెలిపారు.స్థానిక గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల-1 లో గత ఆరు రోజులుగా జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో అనంతగిరి మండలానికి చెందిన మొత్తం 250 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారని సిడిపిఓ ఎన్.సుగుణ పేర్కొన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా అంగన్వాడీ కేంద్రాలను పటిష్టమైన ప్రీ-స్కూల్స్ తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ,ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో ఈ తరగతులు నిర్వహించినట్లు పీఓ వివరించారు.ముఖ్యంగా అంగన్వాడీ పిల్లల ఆరోగ్యం,పౌష్టికాహారం,రక్షణ, సంరక్షణలతో పాటు విద్యా బోధనలో డిజిటల్ సాధనాల వినియోగంపై కార్యకర్తలకు నైపుణ్యాభివృద్ధి కల్పించామన్నారు.'ఆధార్ శిల', 'నవ చేతన' వంటి వినూత్న కార్యక్రమాల అమలు, బడికి పిల్లలను సన్నద్ధం చేయడం,వారి సర్వతోముఖాభివృద్ధిలో తల్లిదండ్రులను ఎలా భాగస్వాములను చేయాలనే కీలక అంశాలపై నూతన ఒరవడిలో మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ అందించినట్లు ఆమె స్పష్టం చేశారు. ఆధునిక విద్యాబోధనపై కార్యకర్తల్లో పూర్తి అవగాహన తీసుకురావడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు.శిక్షణా కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కార్యకర్తలను మూడు వేర్వేరు గ్రూపులుగా విభజించి విద్యాశాఖ ఉపాధ్యాయులు,అంగన్వాడీ సూపర్వైజర్లతో బోధన సాగించినట్లు తెలిపారు.మొదటి బృందానికి శ్రీనివాసరావు,రెండో బృందానికి శివ,అలాగే మూడో బృందానికి దారకొండ మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించి ఆధునిక బోధనా పద్ధతులను వివరించారని పేర్కొన్నారు.ఈ 'జ్ఞాన జ్యోతి' కార్యక్రమంలో సూపర్వైజర్లు జి కృష్ణవేణి, సరస్వతి,సునీత,వరలక్ష్మి,లక్ష్మీదేవి,షకిల,సంతోషి అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాశర్లపూడిలో జెన్నివస్ రెమెడీస్ మెడికల్ షాపు ఆరంభించిన -ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ





**మామిడికుదురు ఆగస్టు 25 (మీ వార్త విలేఖరి ఐ రవి).** పాశర్లపూడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన జెన్నివస్ రెమెడీస్ మెడికల్ షాపును నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గిడ్డి సత్యనారాయణ గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గారు మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో మందులు కొనుగోలు చేయడం సామాన్య ప్రజలకు ఆర్థికంగా భారంగా మారుతోందని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా జనరిక్ మందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అందించడం అభినందనీయమని తెలిపారు.పాశర్లపూడి పరిసర ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గారు కోరారు. జెన్నివస్ రెమెడీస్ సంస్థ కోనసీమలో ఇప్పటికే అమలాపురంలో తన సేవలను ప్రారంభించిందని, తాజాగా పాశర్లపూడిలో ప్రారంభించడంతో పాటు త్వరలో కొత్తపేటలో కూడా కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన జనరిక్ మందులు అందుబాటులోకి రావడం ద్వారా ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జాలం శ్రీనివాసరాజా, బోనం నాగేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పెనుమల లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు బల్ల సతీష్, సొసైటీ చైర్మన్ మంద గాంధీ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కొమ్ముల కొండలరావు, మాజీ సర్పంచ్ ఆడబాల తాతకాపు, కాపు కార్పొరేషన్ చైర్మన్ సుధా బాబ్జి, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్లు తెల్లగరెడ్డి బుల్లి నాగేశ్వరరావు, పినిశెట్టి చంద్రశేఖర్ , వాసంశెట్టి కుమార్ ,విళ్ల సుబ్బారావు, కంకిపాటి నరసింహారావు, మాజీ ఉప సర్పంచ్ తుండూరి బుజ్జి, చుట్టుగుల్ల కిషోర్ , కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# వందేమాతరం పట్ల కాంగ్రెస్ వైఖరి దేశభక్తి ని ప్రశ్నించేలా ఉంది: నల్లా పవన్ కుమార్



**అమలాపురం, మీ వార్త ప్రతినిధి, ఆగస్టు, 25** వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పూర్తి వందేమాతరం గేయాన్ని ఆలపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుపై కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు దేశ ప్రజలను ఆలోచింపజేసేలా ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ అన్నారు. మంగళవారం అమలాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వందేమాతరం కేవలం ఒక గేయం మాత్రమే కాదని, స్వాతంత్ర్యోద్యమంలో కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తినిచ్చిన జాతీయ భావోద్వేగానికి ప్రతీక అని పేర్కొన్నారు. అలాంటి గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమయంలో పూర్తి గేయాన్ని ఆలపించకుండా కేవలం రెండు పంక్తులు మాత్రమే పాడతామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడం బాధాకరమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పూర్తి వందేమాతరం గేయాన్ని ఆలపించే సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులు గేయాన్ని మధ్యలో ఆపిన దృశ్యాలు సోషల్ మీడియా వేదికగా ప్రజల ముందుకు వచ్చాయని నల్లా పవన్ కుమార్ అన్నారు. అనంతరం ఆ చర్యను సమర్థించుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నించడం మరింత ఆశ్చర్యకరంగా ఉందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం గేయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను గుర్తించాలని ఆయన కోరారు. దేశభక్తి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన గేయాన్ని పూర్తిగా ఆలపించడంలో అభ్యంతరం వ్యక్తం చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి స్వాతంత్ర్యం, దేశం, జాతీయ భావాల పట్ల ఉన్న గౌరవం ఎంతమేరకు ఉందో ప్రజలకు స్పష్టమైందని విమర్శించారు. దేశ ప్రజలంతా వందేమాతరం గేయాన్ని గౌరవంగా ఆలపిస్తూ జాతీయ భావాన్ని చాటుకుంటున్న సమయంలో రాజకీయ కారణాలతో దానిపై వివాదం సృష్టించడం సరికాదని అన్నారు. దేశ ప్రయోజనాలు, జాతీయ గౌరవం విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఒకే తాటిపై నిలవాలని నల్లా పవన్ కుమార్ సూచించారు. వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని యువతలో జాతీయ భావాన్ని మరింత పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, జాతీయ గేయాలు మరియు దేశభక్తి భావాలను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని నల్లా పవన్ కుమార్ అన్నారు.

## .గన్నవరం నియోజకవర్గంలో రూ.17.67 కోట్లతో 16 రోడ్లకు శంకుస్థాపన చేసిన -ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**మామిడికుదురు,పి గన్నవరం ఆగస్టు 25 (మీ వార్త విలేఖరి ఐ రవి).** అప్పన్నపల్లి గ్రామంలోని ఉచ్చులవారిపేటలో 2.36 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.45 కోట్ల వ్యయంతో, పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామానికి సంబంధించి శివాయలంకలో 1.60 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.37 కోట్ల వ్యయంతో,నాగులంక గ్రామంలోని నామాడివారిపేటలో 1.20 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శాసనసభ్యులు శ్రీ గిడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పి.గన్నవరం నియోజకవర్గంలో ఏపీఆర్ఆర్ఎస్పీ పథకం కింద 16 రోడ్లు మంజూరు కాగా, మొత్తం రూ.17.67 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇటీవల టెండర్ల ప్రక్రియ పూర్తికావడంతో, మంజూరైన రోడ్ల నిర్మాణ పనులకు దశలవారీగా శంకుస్థాపనలు చేస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే పి.గన్నవరం నియోజకవర్గంలో సుమారు 80 శాతం రోడ్లను పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన రోడ్లను కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు జాలం శ్రీనివాస రాజా, బోనం నాగేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పెనుమల లక్ష్మి, మొల్లేటి శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు బల్ల సతీష్, కంకిపాటి నరసింహారావు, విల్ల సుబ్బారావు, వాసంశెట్టి కుమార్ ,పి గన్నవరం కూటమి మండల అధ్యక్షులు,గ్రామ శాఖ అధ్యక్షులు, సొసైటీ చైర్మన్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, కార్యకర్తలు కుటుంబ నాయకులు పాల్గొన్నారు



## పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డితో గూడెం ఇంచార్జ్ వడ్డీ రఘురాం నాయుడు



**తాడేపల్లిగూడెం ఆగస్టు 25 (మీ వార్త ప్రతినిధి)** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గం సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధినేత జగన్ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఎక్కడ రాజీ పడవద్దని,ఏకగ్రీవలకు తావివ్వకుండా అభ్యర్థులను నిలపాలని సూచించినట్లు సమాచారం.అంతేకాకుండా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలకు తీవ్ర వ్యతిరేకత ఉన్నట్లు ఆయన వడ్డీతో చర్చించినట్లు సమాచారం. ప్రభుత్వ వ్యతిరేక ఓటును పార్టీ విజయానికి ఉపయోగపడే మలుచుకోవాలని వడ్డీ రఘురాం నాయుడుకి అధినేత జగన్మోహన్ రెడ్డి సూచించినట్లు రఘురాం నాయుడు కార్యాలయం వర్గాలు పేర్కొన్నాయి.

## 15 ఏళ్లుగా కలుషిత నీటితోనే సహవాసం..

కట్టువపొదలగూడెం గ్రామస్థుల నిరాహార దీక్ష



**?జంగారెడ్డిగూడెం, ఆగస్టు 25:**ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డిగూడెం మండలం అమ్మపాలెం పంచాయతీ పరిధిలోని కట్ట పొదుల వారి గూడెం గ్రామంలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. గత 15 ఏళ్లుగా సురక్షిత మంచినీరు అందక, బురదతో కూడిన కలుషిత నీటిని తాగుతూ నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ మంగళవారం గ్రామస్థులు నిరాహార దీక్షకు దిగారు.?గ్రామం నడిబొడ్డున అంబేద్కర్ విగ్రహం వద్ద టెంట్ వేసి గ్రామస్థులు, మహిళలు ఎండను సైతం లెక్కచేయకుండా ఆందోళన చేపట్టారు. పంచాయతీ నుంచి వస్తున్న మట్టి నీటిని తాగి పిల్లలు, వృద్ధులు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం ప్రతిరోజూ ఇతర గ్రామాల నుంచి రూ. 10 వెచ్చించి వాటర్ క్యాన్లు తెచ్చుకోవాల్సి వస్తోందని, లేదంటే చుట్టుపక్కల పొలాల వద్ద మోటార్ల నీటిపై ఆధారపడాల్సి వస్తోందని వాపోయారు. 300 నుంచి 400 కుటుంబాలు నివసిస్తున్న తమ గ్రామానికి కనీస డ్రైనేజీ వసతి కూడా లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేరే ప్రాంతంలో కొత్త బోర్ వేసి శాశ్వత ప్రాతిపదికన మంచినీటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ?ఈ నిరసనపై స్థానిక జనసేన ఇన్‌చార్జ్ స్పందిస్తూ, సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. పంచాయతీ సెక్రటరీ స్పందిస్తూ సమస్య అధికారుల పరిశీలనలో ఉందని, త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఈ తాగునీటి సమస్యకు అధికారులు నిజంగానే మోక్షం కల్పిస్తారా లేక హామీలకే పరిమితమవుతారా అని గ్రామస్థులు వేచి చూస్తున్నారు.

## క్రీడల్లో ప్రతిభను వెలికితీయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

ఏపీ స్పోర్ట్స్ ఆథారిటి డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి







**పోలవరం మీ వార్త ఆగస్టు 25** అమరావతి ఛాంపియన్‌షిప్‌లో రెండో రోజు ఉత్సాహంగా క్రీడా పోటీలు అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో రెండో రోజు పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్లు కొవ్వాసు జగదీశ్వరి, బుచ్చిరాజు క్రీడాకారులను కలుసుకున్నారు. క్రీడాకారులతో కరచాలనం చేసి అభినందనలు తెలిపారు. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభను వెలికితీయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. క్రీడాకారులతో ఆత్మీయంగా మాట్లాడి వారి ప్రతిభను అభినందించారు. పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ చూపుతున్న వారికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. అమరావతి ఛాంపియన్‌షిప్‌లో క్రీడాకారుల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ప్రభుత్వ పథకాలను అభివృద్ధిని ఇంటింటికి ప్రచారం

ఏపీ ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు



**పోలవరం,మీ వార్త ఆగస్టు 25** పోలవరం మండలం పోలవరం పంచాయతీ 264 బూత్ నెంబర్ లో తెలుగుదేశం పార్టీ పోలవరం నియోజకవర్గం ఇంచార్జ్, ఆంధ్రప్రదేశ్ ట్రైకర్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు తో కలిసి మండల పార్టీ అధ్యక్షులు మంగిన వెంకటరమణ మంగళవారం డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు.కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. పేద ప్రజల అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని బోరగం శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మంగిన వెంకటరమణ, పాదం ప్రసాద్, నల్ల రాంబాబు, యడ్ల వినోద్,ఆకుల రాజా పట్నాల నారాయణ రావు మరియు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారం,కిశోరుల ఆరోగ్యంపై నేచర్ సంస్థ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన.

నేచర్ సంస్థ డైరెక్టర్ వికాస్ బాలరాజు.

**అనంతగిరి/అరకులోయ,ఆగస్టు 25 ( మీ వార్త )** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి,అరకు,డుంబ్రిగూడ మండలాల్లో నేచర్ సంస్థ ఆధ్వర్యంలో పోషకాహారం,కిశోరుల ఆరోగ్యం,సికిల్ సెల్ రక్తహీనత,హెచ్ఐవీలపై ప్రజలకు,విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎస్. వికాస్ తెలిపారు.మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..తొమ్మిది గ్రామ పంచాయతీల పరిధిలోని సుమారు 170 గ్రామాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యాశాఖ,మాతా శిశు సంక్షేమ శాఖ,పంచాయతీ రాజ్ శాఖ,పెసా,మరియు గ్రామ సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఈ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.డిజిటల్ బోర్డుల ద్వారా ఆరోగ్య విద్య,మూడు మండలాల్లోని అన్ని పాఠశాలల్లో కిశోర బాలురు,బాలికలకు పోషకాహారం,వ్యక్తిగత పరిశుభ్రత,రక్తహీనత, సికిల్ సెల్ రక్తహీనత,హెచ్ఐవీలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాల వెబ్‌సైట్‌లోని ఆరోగ్య సమాచారాన్ని పాఠశాలల్లో డిజిటల్ బోర్డుల ద్వారా ప్రదర్శిస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఆరోగ్య విద్యను అందిస్తున్నామని తెలిపారు.కిశోర దశలో సరైన పోషకాహారం తీసుకోవడం,ముఖ్యంగా బాలికలు ఐరన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు.సికిల్ సెల్ రక్తహీనతను ముందుగానే గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని,హెచ్ఐవీపై ఉన్న అపోహలను తొలగించుకోవాలని ఆయన సూచించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా మానవత్వంతో వ్యవహరించాలని కోరారు.ఆరోగ్యకరమైన



కిశోరులు, ఆరోగ్యకరమైన కుటుంబాలు,ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే నేచర్ సంస్థ లక్ష్యమని ఎస్.వికాస్ స్పష్టం చేశారు.

# శ్రీకృష్ణజన్మాష్టమినిపురస్కరించుకొనిరాజమహేంద్రవరం ఇస్కాన్ టెంపుల్ లో మహోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

ఇస్కాన్ నిర్వాహకులు

**రాజమహేంద్రవరం ఆగస్టు 25 (మీ వార్త ప్రతినిధి)** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరి తీరాన దర్శనమిస్తున్న ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమిపురస్కరించుకొనిఈనెల 28వతేదీ నుండి వచ్చేనెల 5వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు నిర్వహించేవేడుకలలోభక్తులు భక్తిశ్రద్ధలతోపాల్గొనాలని ఇస్కాన్ నిర్వాహకులు ఆహ్వానించారు.ఇస్కాన్ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు శ్రీకృష్ణ మహోత్సవాలను అత్యంత వైభవోపేతంగానిర్వహించనున్నట్లు ఇస్కాన్ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా వివిధ కార్యక్రమాలతో మహోత్సవాలను నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలనునిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది కూడా తొమ్మిదిరోజులపాటు జరిగే మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఆలయప్రాంగణాన్నిప్రత్యేకంగా అలంకరించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ హరినామ సంకీర్తన, భజనలు, కీర్తనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీకృష్ణుడి లీలలను, భగవద్గీత సందేశాన్ని భక్తులకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక సందేశంశ్రీకృష్ణ తత్వం మానవాళికి ఎంతో విలువైన సందేశాన్ని అందిస్తుందని ఇస్కాన్ నిర్వాహకులు తెలిపారు. ప్రేమ, ధర్మం, సేవ, భక్తి, సత్యం వంటి విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు మానవాళికి అందించిన సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ మహోత్సవాల ప్రధాన ఉద్దేశమని వివరించారు. తొమ్మిది రోజులపాటు జరిగే వేడుకల్లో చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొనేలా కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు.శ్రీకృష్ణమహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక అలంకరణలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పుష్పాలు, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు శ్రీకృష్ణుడి జీవిత




విశేషాలనుప్రతిబింబించేలా ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.మహోత్సవాల సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, ప్రసాదం తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించేందుకు ఇస్కాన్ సేవకులు, పోలీసుల సహాయ సహకారాలు అందించనున్నారని తెలిపారు. శ్రీకృష్ణ మహోత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచి మాత్రమే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర చైతన్య దాస్, హేమ నిమయిదాస్, శ్రీహరి కరుణదాస్ లు పాల్గొన్నారు.

## ఎంఎస్పి ఎంఆర్పిఎస్ నూతన మండల కమిటీల ఎన్నిక

**హోళగుంద :** మండల కేంద్రంలో మంగళవారం ఎంఎస్పి ఎంఆర్పిఎస్ నూతన మండల కమిటీని ఏకగ్రీవం ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు జిల్లా ఎంఎస్పి ఎంఆర్పిఎస్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు,హోళగుంద మండల ఇంచార్జ్ ఆస్పరి పెద్ద సంజప్ప హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అణగారిన వర్గాల



ఆశాజ్యోతి,పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ దేశంలో ఏ కుల సంఘానికి దక్కని గౌరవాన్ని మాదిగలతో పాటు అణగారిన వర్గాలకు తీసుకువచ్చారని అన్నారు.1994 జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో ప్రారంభమైన ఎంఆర్పిఎస్ ఉద్యమం నేడు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు విస్తరించి సామాజిక న్యాయం కోసం పోరాడుతోందన్నారు.తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వికలాంగుల సంక్షేమం, ఆరోగ్యశ్రీ,నిరుపేదలకు బియ్యం,ఎస్సీ,ఎస్టీ,బీసీ ఉద్యోగ ప్రమోషన్లు,వివిధ సంక్షేమ పథకాల కోసం జరిగిన పోరాటాల్లో మందకృష్ణ మాదిగ కృషి కీలకమని పేర్కొన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్,మహాత్మా జ్యోతిరావు పూలే,కాన్షీరాం ఆశయాల సాధన కోసం మాదిగలు,ఉపకులాలు,ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల ప్రజలు మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.అనంతరం ఎంఎస్పి నూతన మండల కమిటీ మండల అధ్యక్షుడిగా చిన్నహ్యాట దేవప్ప రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మండల అధికార ప్రతినిధిగా నాగరకన్వి వెంకటేష్ మాదిగ ఏకగ్రీవం ఎన్నుకున్నారు.మరియు ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడిగా రెండోసారి ఎస్. కెంచప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మండల అధికార ప్రతినిధిగా తప్పెట మల్లికార్జున మాదిగ ఏకగ్రీవం ఎన్నుకున్నారు.అదేవిధంగా ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు హెబ్బటం పక్కిరప్ప,జిల్లా సీనియర్ నాయకులు బి. మల్లికార్జున,ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు పంచగుండిగ వెంకటేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్,సమ్మతగేరి తిక్కప్ప, కోకిలతోట గోవర్ధన్,లక్ష్మీకాంత్,డి. వెంకటేష్,మృత్యుంజయ,సినిమా మంగన్న, ముత్తయ్య, వరాల మల్లి,లింగంపల్లి శేషగిరి,తప్పెట మల్లికార్జున,నాగరాజ్,పల్లి ఈరన్న, చిన్నహ్యాట మల్లికార్జున తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఆళ్ళగడ్డ హైవే దగ్గర బస్సు బోల్తా, 10 మందికి గాయాలు

**ఆళ్లగడ్డ :** మంగళవారం ఆళ్లగడ్డ నుండి ప్రొద్దటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు ఆళ్లగడ్డ హైవే కింద ఉన్న సర్వీస్ రోడ్డు వద్ద అదుపుతప్పి పక్కకు ఒరిగింది , దీంతో ఒక్కసారిగా బస్సులో ఉన్నవారంతా బయందోళన చెందారు. పక్కనున్న వారంతా కలిసి కలిసి బస్సులో ఉన్న వారిని క్షేమంగా బయటికి తీసుకొచ్చారు ?గాయపడ్డా వారిని




అంబులెన్సు ద్వారా ఆసుపత్రికి తరలించారు.

## ప్రజా విశ్వాసమే సమర్థవంతమైన పోలీసింగ్‌కు పునాది

క్షేత్రస్థాయిలో పోలీసింగ్ బలోపేతమే లక్ష్యం: ఎస్పీ డా. శబరీష్,

**మహబూబాబాద్ జిల్లా.** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని కిట్‌లను, రికార్డులను, వివిధ గదులను, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రిసెప్షన్‌ను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలు, స్టేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు.స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్క సిబ్బందితో ఎస్పీ స్వయంగా మాట్లాడి, వారి విధి



నిర్వహణ, ఎదురవుతున్న డ్యూటీ సంబంధిత సమస్యలు, వ్యక్తిగత సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తనతో స్వేచ్ఛగా పంచుకోవచ్చని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిబ్బందికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా రొటీన్ హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ముఖ్యమైన రికార్డులు, అఆ ఈతిశ్రీవబ (అజీబవ ఆతిజీతీతివబ), దర్యాప్తు పత్రాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తు పురోగతి, కేసుల పెండెన్సీ, రికార్డుల నిర్వహణ, అఉఔొలో వివరాల నమోదు, అప్‌డేషన్ తదితర అంశాలను సమీక్షించారు. ప్రతి కేసు దర్యాప్తులో క్షేత్రస్థాయిలో పర్యటించి, వాస్తవాలను సేకరించి, శాస్త్రీయ పద్ధతుల్లో దర్యాప్తును ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ూఎ రాజుతో కేసుల దర్యాప్తు, స్టేషన్ నిర్వహణ, రికార్డుల అప్‌డేషన్, అఉఔొ నిర్వహణ, ఎఖూల పనితీరు తదితర అంశాలపై ఎస్పీ చర్చించి పలు సలహాలు, సూచనలు చేశారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించి, ప్రతి కేసుకు సంబంధించిన రిపోర్టులు, రికార్డులు, అఆ ఈతిశ్రీవబను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.ఎఖూల పనితీరుపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రతి ఎఖూ తనకు కేటాయించిన గ్రామాన్ని నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని పోలీస్ శాఖ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వారానికి కనీసం ఒకసారి గ్రామాలను తప్పనిసరిగా సందర్శించి, ప్రజల్లో పోలీసులపై నమ్మకం మరియు భద్రతా భావన కలిగించే విధంగా పనిచేయాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, గుడుంబా మరియు ఇతర అక్రమ మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. గుడుంబా తయారీ, అక్రమ విక్రయాలు, రవాణాపై నిరంతరం దాడులు నిర్వహిస్తూ కఠినమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ చేపట్టాలని, అక్రమ మద్యం తయారీ కేంద్రాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు మరియు వినియోగంపై పటిష్టమైన నిఘా కొనసాగించాలని తెలిపారు.పోలీసింగ్ అనేది కేవలం పోలీస్ స్టేషన్‌కు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలతో నిరంతర అనుసంధానంతో కొనసాగాలని ఎస్పీ తెలిపారు. అధికారులు, సిబ్బంది కేసుల విచారణలో భాగంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి, ప్రతి అంశాన్ని స్వయంగా పరిశీలించి దర్యాప్తు నాణ్యతను పెంచాలని సూచించారు. నేరాల నియంత్రణలో ముందస్తు నిఘా, నిరంతర ఫీల్డ్ విజిట్స్ కీలకమని పేర్కొన్నారు.అఉఔొలో కేసులకు

## ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం

చిన్నారుల సమగ్ర అభివృద్ధికి జ్ఞానజ్యోతి శిక్షణ ఎంతో ఉపయోగకరం

**కుక్కునూరు ఆగస్టు 25(మి వార్తా ప్రతినిధి)** కుక్కునూరు ప్రాజెక్టు ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాలలో రెండు దశల్లో ఆరు రోజుల పాటు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నేటితో ముగిసింది. ఈ సందర్భంగా సీడీపీఓ యు. అనంతలక్ష్మి, సూపర్‌వైజర్లు రుక్మిణి, మయూరి మాట్లాడుతూ అంగన్‌వాడీ



కేంద్రాలకు వచ్చే చిన్నారులకు నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్యను అందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి జ్ఞానజ్యోతి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల చిన్నారుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడం, ఆటలు, పాటలు, కథలు, చిత్రాలు, వివిధ విద్యా కార్యకలాపాల ద్వారా పిల్లలకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించడం వంటి అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. చిన్నారుల్లో భాషా పరిజ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాలను పెంపొందించే విధానాలపై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పిల్లల శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధిని గుర్తించడం, ఆరోగ్యం--పరిశుభ్రత, పోషకాహారం, పిల్లల భద్రత తదితర అంశాలపై కూడా శిక్షణ అందించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించి, వారిలో పాఠశాల విద్యకు అవసరమైన ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించడమే జ్ఞానజ్యోతి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆచరణలో పెట్టి, చిన్నారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సీడీపీఓ, సూపర్‌వైజర్లు సూచించారు. ఆరు రోజుల పాటు శిక్షణలో చురుగ్గా పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలను వారు అభినందించారు.

## మరోసారి మానవత్వం చాటుకున్న చిన్నబాబు...

అనారోగ్యంతో బాధపడుతున్న ఆయాకు రూ.25 వేల సాయం...

**ఆలమూరు, ఆగస్టు 25(మీ వార్త ప్రతినిధి )** కష్టాల్లో ఉన్నవారికి చేయూతనందిస్తూ పెనికేరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వెంకటేశ్వర సంస్థల అధినేత ఈదర చిన్నబాబు మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ప్రభుత్వ పాఠశాల ఆయా మందపల్లి జ్యోతిని ఆయన పరామర్శించి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన జ్యోతి



స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆయాగా పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. షుగర్ వ్యాధి తీవ్రత పెరగడంతో ఆమె కాలుకు ఇబ్బంది తలెత్తింది. దీంతో చికిత్స చేయించుకుని ప్రస్తుతం ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటుంది. ఈ విషయం తెలుసుకున్న చిన్నబాబు పార్టీ నాయకులతో కలిసి ఆమె ఇంటికి వెళ్లారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. వైద్య ఖర్చులకు తక్షణ సాయంగా రూ.25 వేల నగదును అందజేశారు. గ్రామ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ అవసరమైన సమయంలో స్పందిస్తున్న చిన్నబాబు సేవలను స్థానికులు అభినందించారు.

## నెల్లిపాకలో స్వచ్ఛ రథం ప్రారంభం

ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణకు ఎలక్ట్రిక్ బ్యాటరీ ఆటో

చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలి: ఎంపీడీవో విజయ దత్




**ఎటపాక, ఆగస్టు 25 (మీ వార్తా** విలేకరి పోలవరం జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామపంచాయతీలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా మంజూరైన ఎలక్ట్రిక్ బ్యాటరీ ఆటోను మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎల్. విజయదత్ ప్రారంభించారు. జెండా ఊపి స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఆయన గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో విజయదత్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి ఇంటి వద్ద తడి చెత్త, పొడి చెత్తను తప్పనిసరిగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. ఇంటింటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను స్వచ్ఛత కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ)కి తరలించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహిస్తామని తెలిపారు. తడి చెత్తతో సేంద్రియ వర్మీ కంపోస్ట్ తయారు చేయడంతో పాటు, సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీ-సైక్లింగ్ ప్రక్రియ ద్వారా వినియోగంలోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. దీంతో గ్రామంలో చెత్త సమస్యను తగ్గించడంతో పాటు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నెల్లిపాక గ్రామానికి స్వచ్ఛ రథాన్ని మంజూరు చేయడంలో సహకరించిన స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నెల్లిపాక గ్రామానికి స్వచ్ఛ రథం మంజూరులో కృషి చేసిన మాజీ స్మార్ట్ విలేజ్ పార్టనర్ నలజాల శంకరరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యప్రసాద్, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by U. SHEKHAR. And Printed at Mani Raghava Printers, #A-20, Vambay Colony, Hyderabad, Rajendranagar, Rangareddy, Telangana.
Published at Manikanta Publications, H.No. 3-67/3/66, Netaji Nagar, Nallagandla, Serilingampally, Rangareddy (Dist), Telangana, EDITOR U.SHEKHAR, RNI. NO. TEL/2018/77112

## అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి సీనియర్ నేతలు పరామర్శ

పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



**పెడన ఆగస్టు 25(మీ వార్త ప్రతినిధి)** పెడన: పెడన మండల పరిధిలోని కాకర్లమూడి, కొంకేపూడి గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పరసా పెద్ద వెంకయ్య, పమ్మి సీతారామయ్యలు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ వారిని పరామర్శించారు. వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఎమ్మెల్సీ వర్ల రామయ్యను కలిసిన తల్లాడ మండల టీడీపీ నాయకులు

పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానం


ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణకు నారా లోకేష్‌ను ఆహ్వానించేలా చర్చ



**తల్లాడ, మీ వార్త ప్రతినిధి ఆగస్టు 25** ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యుడిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన టీడీపీ సీనియర్ నాయకులు వర్ల రామయ్యను తల్లాడ మండల టీడీపీ నాయకులు మంగళవారం మంగళగిరిలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన వర్ల రామయ్యకు తల్లాడ మండల టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యలను శాసన మండలి వేదికగా ప్రస్తావిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. టీడీపీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా చర్చించారు. అనంతరం తల్లాడలో ఏర్పాటు చేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం గురించి వర్ల రామయ్యతో చర్చించారు. త్వరలో మరోసారి మంగళగిరి పార్టీ కార్యాలయానికి వెళ్లి ఆంధ్రప్రదేశ్ టీడీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి తల్లాడకు వచ్చేలా సమయం కేటాయించాల్సిందిగా కోరనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్, తల్లాడ మండల టీడీపీ నాయకులు ధూపాటి భద్రరాజు, సరికొండ శ్రీనివాసరాజు, మొక్క కృష్ణార్జున్, పెరిక కిట్టు, కొమ్మినేని సత్యనారాయణ, దుగ్గినేని వెంకటేశ్వర్లు, గుండ్ల నాగయ్య, బొడ్డు రామకృష్ణ, చెన్నారావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కర్ణభక్త ఏ సి కళ్యాణ మండపం ప్రారంభోత్సవం

పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్





**పెడన ఆగస్టు 25(మీ వార్త ప్రతినిధి)** శ్రీ బాల గణపతి స్వామి, శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కర్ణభక్త ఏ సి కళ్యాణ మండపం ప్రారంభోత్సవం పెడన పట్టణం 7వ వార్డులో శ్రీ బాల గణపతి స్వామి, శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కర్ణభక్త"ఆా/జ కళ్యాణ మండపం (పై అంతస్తు) ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పెడన శాసనసభ్యులు శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ ఈ సందర్భంగా కళ్యాణ మండపం ద్వారా ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వార్డు చార్జీలు, శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కర్ణభక్త కళ్యాణ మండపం కమిటీ సభ్యులు, భక్తులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## పేదరికంతో ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదు : ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం ఆగస్టు 25 (మీ వార్త ప్రతినిధి)** పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో తాడేపల్లిగూడెంలో పి-ఫోర్ ను అనుసంధానిస్తూ దాతల సహకారంతో ఉన్నత ప్రమాణాలతో జూనియర్ కళాశాల నిర్మాణం చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక గణేష్ నగర్ లో రూ. 2.55 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న జూనియర్ కళాశాల భవనం నిర్మాణ పనులను ఎమ్మెల్యే మంగళవారం పరిశీంచారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్య అందరికి సమానంగా అందాలన్నారు. అలా విద్య అందిన నాడే పేదరికం దూరం అవుతుందన్నారు.పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. దాతల సహకారంతో,ప్రజల భాగస్వామ్యంతో మెరుగైన ఆధునిక వసతులను కల్పిస్తూ కళాశాలను నిర్మిస్తున్నామన్నారు. నిర్మాణంలో ఎటువంటి నాణ్యత లోపాలు ఉండరాదని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.పి-ఫోర్ విధానంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు.విద్యే భవిష్యత్తుకు పునాది అని,నాణ్యమైన విద్యతోపాటు, మౌలిక సదుపాయాల కల్పనే తమ లక్ష్యం అన్నారు.

## కాకర్లమూడిలో వేడెక్కిన రాజకీయం

స్థానిక సంస్థల ఎన్నికల సమరం షురూ....

సర్పంచ్ అభ్యర్థిగా తన పేరు పరిశీలించాలన్న కన్నూరి శ్రీనివాస్



**ఉంగుటూరు, ఆగస్టు 25 (మీ వార్త ప్రతినిధి)**ఉంగుటూరు మండలం లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి రాజుకుంది. ఎమ్మెల్యే పత్స మట్ల ధర్మరాజు మంగళవారం ఉంగుటూరు మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి నాయకుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లి వారి అభిప్రాయాలు తెలియజేశారు. జనసేన పార్టీ కార్యాలయానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై తమ నియోజకవర్గం జనసేన బిజెపి తెలుగుదేశం కూటమి పార్టీల మధ్య సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ధర్మరాజు సూచించారు. వీటిలో భాగంగా జనసేన తరపున ఏ సామాజిక వర్గం నుంచి ఏ అభ్యర్థి బరిలో ఉంటాడు అనే అంశాలపై చర్చించారు. మండలంలోని కాకర్లమూడి నుంచి కన్నూరి అచ్చన్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీగా కూటమి నాయకులు ర్యాలీగా బయలుదేరి ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద తమ గ్రామం నుంచి సర్పంచ్ అభ్యర్థిగా కన్నూరి శ్రీనివాస్ పేరు పరిశీలించాలని ఎమ్మెల్యే ధర్మరాజు దృష్టిలో ఉంచారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఎన్నికల్లో స్థానికులు అందరినీ సమన్వయం చేసుకునే ముందుకు వెళ్లే వారికి పెద్దపీట్టవేస్తామని అన్ని సామాజిక వర్గాలను ఒప్పించి ముందుకు వెళ్లాలని నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా కన్నూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ధర్మరాజు ఆదేశాల మేరకు ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి సంక్షేమం పథకాలు వివరిస్తూ డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న- టిడిపి సీనియర్ నాయకులు



**అంబాజీపేట ఆగస్టు 25 (మీ వార్తా విలేకరి రవి)** అంబాజీపేట మండలం 119 ,122 బూత్ లలో"రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొని గ్రామంలోని పలు కుటుంబాలను కలిశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను తెలియజేశారు ఈ సందర్భంగా ప్రజల నుంచి లభించిన ఆత్మీయత, ఆదరణ ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలుగుదేశం పార్టీపై ప్రజలు ఉంచుతున్న నమ్మకానికి, చూపిస్తున్న అభిమానానికి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు అన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నాగ బత్తుల వెంకట సుబ్బారావు తెలుగు అధ్యక్షులు జోగి కృష్ణ చైతన్య కో యూనిట్ ఇంచార్జ్ బచ్చు చినబాబు బూత్ కన్వీనర్ ముష్టి వెంకట రాజేశ్వర్ శర్మ, కొప్పునుడి ఈశ్వరరావు.నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవ ఎరువులతోనే భూసార రక్షణ.

ఆత్మ ఆధ్వర్యంలో జీవ ఎరువులపై రైతులకు శిక్షణ.



**అనంతగిరి,ఆగస్టు 25 ( మీ వార్త )** వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ ) ఆధ్వర్యంలో అనంతగిరి మండలం చిలకలగెడ్డ రైతు భరోసా కేంద్రం లో రైతులకు జీవ ఎరువుల వినియోగం మరియు ప్రాధాన్యతపై శనివారం ఒక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు మోహన రావు, అనంతగిరి మండల వ్యవసాయ అధికారి రంగా రావు మాట్లాడుతూ..రైతులు రసాయన ఎరువులపైనే పూర్తిగా ఆధారపడకుండా,జీవ ఎరువుల ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు.జీవ ఎరువుల రకాలు,వాటిని పంటలకు వినియోగించే విధానాలను రైతులకు వివరించారు. విచక్షణారహితంగా రసాయన ఎరువులను అధికంగా వాడటం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటుందని,సమతుల్య ఎరువుల వినియోగంతో పాటు జీవ ఎరువులను కూడా ఉపయోగించాలని సూచించారు.జీవ ఎరువుల వల్ల నేలలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది, పోషకాల లభ్యత పెరగడంతో పాటు భూసారం మెరుగుపడుతుందని తెలిపారు.సరైన పద్ధతుల్లో వీటిని వాడటం ద్వారా సాగు వ్యయాన్ని తగ్గించుకుని,అధిక పంట దిగుబడిని సాధించవచ్చని పిలుపునిచ్చారు.అనంతరం రైతులు అడిగిన పలు సందేహాలకు అధికారులు నివృత్తి చేశారు.ప్రకృతి అనుకూలమైన, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రతి ఒక్కరూ విస్తృతంగా అవలంబించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు రాంబాబు, మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ జ్యోతి మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ పితామహుడు బిపి మండల్ : బీసీ నాయకులు



**తాడేపల్లిగూడెం ఆగస్టు 25 (మీ వార్త ప్రతినిధి)** రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ గా బిందెశ్వరీ ప్రసాద్ మండల్ (బి పి మండల్) సామాజికంగా విద్యాపరంగా వెనుకబడిన తరగతులను గుర్తించి వారికి న్యాయం కల్పించడంతో న్యాయ పితామహుడిగా బీపీ మండల్ గుర్తింపు పొందారని బీసీ నాయకులు బీసీ సంక్షేమ సంఘం తాడేపల్లిగూడెం నియోజకవర్గం అధ్యక్షులు కేశవభట్ల విజయ్,పెంటపాడు మండలం అధ్యక్షులు కాజులూరి దుర్గ మల్లేష్,జిల్లా ఉపాధ్యక్షులు బండారు బెనర్జీ బాబు,యువజన నాయకుడు బైనపాలెపు ముఖేష్ పేర్కొన్నారు. బిపి మండల్ జయంతి పురస్కరించుకుని వారు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కేశవభట్ల విజయ్ మాట్లాడుతూ సామజికంగా, విద్యాపరంగా,ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బీ పీ మండల్ చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. వెనుకబడిన తరగతులకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఆయన చేసిన పోరాటం నేటి తరానికి పూర్తి దాయకమని పేర్కొన్నారు. కాజులూరి మల్లేష్ మాట్లాడుతూ  బిపి మండల్ కమిషన్ ద్వారా వెనుకబడిన వర్గాల సమస్యలను దేశవ్యాప్తంగా వెలుగులోకి తీసుకువచ్చి, సామాజిక న్యాయం కోసం బలమైన పునాది వేశారన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతికి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.బండారు బెనర్జీ బాబు మాట్లాడుతూ బీ పీ మండల్ ప్రధాని వీపీ సింగ్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఆధారంగానే దేశంలో వెనుకబడిన తరగతులకు రాజకీయ చైతన్యం, విద్యా,ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు.ఇది భారత రాజకీయాలనే మార్చిన సైలెంట్ విప్లవం అన్నారు.ముఖేష్ మాట్లాడుతూ బీ పీ మండల్ ఆశయాలే సామజిక న్యాయానికి మార్గదర్శం అన్నారు.

## ప్రచురణలో అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియచేయండి



**ముమ్మిడివరం ఆగస్టు 25 మీవార్త ప్రతినిధి** పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ వారి మెమో నెం.3376292/పిఆర్ఆర్01/ఇడఆర్/ఏ 1/2026, ను అనుసరించి సి హెచ్ గున్నేపల్లి గ్రామ పంచాయతీకి సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల డ్రాఫ్టింగ్ లిస్ట్ ను ది.25.08.2026న గ్రామ పంచాయతీ నోటీసు బోర్డు నందు ప్రచురించడమైనదని తెలియచేస్తూ సదరు డ్రాఫ్ట్ పబ్లికేషన్ నందు అభ్యంతరములు ఉన్న యెడల 28/08/2026 తేదీ కంటే ముందు లిఖిత పూర్వకంగా చెయ్యేరు గున్నేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయానికి దరఖాస్తు సమర్పించాలని పంచాయతీ సెక్రటరీ తెలియ జేశారు.

## బంగారు కుటుంబం పథకంలో 10 కుటుంబాలకు నిత్యవసర సరుకుల పంపిణీ.

**రౌతులపూడి ఆగస్టు 25 :( మీ వార్త న్యూస్ ప్రతినిధి)**



కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకంలో భాగంగా ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరపుల. సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు రాజవరం గ్రామంలో పి 4(బంగారు కుటుంబం) పథకం లో 10 నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు . గ్రామ టిడిపి అధ్యక్షుడు చింతకాయల.రాజు బాబు ఆధ్వర్యంలో కూటమి నాయకులు కార్యకర్తలు సుమారు 20వేల రూపాయలు తమ సొంత నిధులతో రైస్ బ్యాగ్ మరియు నిత్యవసర సరుకులను పది కుటుంబాలకు పంపిణీ చేసారు.. గ్రామ టిడిపి అధ్యక్షుడు చింతకాయల రాజబాబు, షేక్ వెంకటేష్, మన్నే గంగరాజు, దార్ల నాగేష్, ఈగల లోవరాజు, అడిగర్ల లోవరాజు, చింతకాయల కుశరాజు, అడిగర్ల దేవుడు, ఏడిద లోవరాజు, ఏడిద పాపయ్య, రుత్తల గోవిందు,బక్కా పెద్ద రమణ,కాతేటి లోవ మరియు పంచాయతీ కార్యదర్శి భూలక్ష్మి పాల్గొన్నారు.

## సాధిక్ ను కఠినంగా శిక్షించాలి - బిజెపి నాయకులు



**కుక్కునూరు,ఆగస్టు 25 (తెలుగురాష్ట్రం విలేకరి)** ఏ ఈ నూకరాజు కుటుంబం, రాజమండ్రి రోడ్ కం బ్రిడ్జి పైనుంచి నదిలోకి దూకి చనిపోవడానికి కారకుడైన సాదిక్ ను కఠినంగా శిక్షించాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. నూకరాజు కూతుర్ని మతం మారమని తీవ్రమైన ఒత్తిడి చెయ్యడం తో కాకినాడలో సాదిక్ ఖాన్ లవ్ జిహాదీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న ఏఈ నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలని రాష్ట్ర పార్టీ అదేదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా అన్నీ పోలీస్ స్టేషన్ లు మరియు స్థానిక కుక్కునూరు పోలీస్ స్టేషన్ లో బిజెపి నాయకులు పిర్యాదు చేశారు. ఈ కేసులో వంచన, మోసం, దోపిడీ, హత్య, లవ్ జిహాదీ, ఉగ్రవాద కోణాలపై సమగ్ర దర్యాప్తు జరిపి, సాధిక్ ఖాన్‌ను కఠినంగా శిక్షించాలని ఎస్ ఐ రాజారెడ్డి వినతిపత్రం అందజేశారు . ఈ ఘటనపై రాష్ట్ర డీజీపీ, హోంమంత్రి తక్షణమే స్పందించాలని కోరారు.ఈ కార్యక్రమం లో బీజేపీ మండల అధ్యక్షులు కె వి ఎన్ దొర, ధార్మిక సెల్ కో కన్వీనర్ వాడపల్లి లక్ష్మణచార్యులు, కార్యదర్శి వేముల శేషగిరి యాదవ్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.